# ధర్మఘంటి

జాతీయ తెలుగు దినపత్రిక

TELTEL/2012/47103

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 227 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | శుక్రవారం 14 నవంబర్ 2025 | పేజీలు : 8 | వెల : 1

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar


## పీఎంస్వనిధి పథకాన్ని డిజిటల్ రూపంలో పొందే ఛాన్స్

ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) వీధి వ్యాపారులకు గుడ్‌న్యూస్ ప్రకటిం చింది. పీఎం స్ట్రీట్ వెండార్స్ ఆత్మనిర్భర్ నిధి(పీఎంస్వనిధి), ఇతర బ్యాంకు సౌకర్యాల కోసం డిజిటల్ పరిష్కారాలను ప్రారంభించినట్టు ప్రకటనలో వెల్లడించింది. దీనికోసం ప్రత్యేక డిజిటల్ ప్లాట్‌ఫామ్, ప్రక్రియను అందుబాటులోకి తీసుకొచ్చామని, దీనివల్ల వీధి వ్యాపారులు

## ప్రపంచంలోనే అతిపెద్ద బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్

బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్స్ (బీఈఎస్ఎస్) రంగంలోకి అడుగు పెడుతున్నట్లు అదానీ గ్రూప్ ప్రకటించింది. గుజరాత్‌లోని ఖవ్దాలో 1,126 మెగావాట్/ 3,530 మెగావాట్ అవర్ సామర్థ్యంతో ఏర్పాటు కాబోతున్న ఈ ప్రాజెక్టు 2026 మార్చికి అందుబాటులోకి రానుంది. ఈ ప్రాజెక్టులో 700కు పైగా బీఈఎస్ఎస్ కంటెయినర్లు ఏర్పాటు చేస్తున్నారు.



# నష్టాల్లో ఉన్న ఆర్టీసీ డిపోలను లాభాల్లోకి తెచ్చే కార్యాచరణ రూపొందిస్తున్నాం

మంత్రి పొన్నం ప్రభాకర్

ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షా సమావేశం

ఆర్టీసీ రెవెన్యూ పెంచేందుకు మార్గాలు అన్వేషించాలని అధికారులకు ఆదేశం

కొత్త కాలనీలకు రూట్‌లు పెంచేలా అధ్యయనం చేయాలని సూచన

హైదరాబాద్

నష్టాల్లో ఉన్న డిపోలను లాభాల్లోకి తెచ్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ ఆదాయం పెంచే మార్గాలను అన్వేషించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కొత్త కాలనీలకు రూట్‌లు పెంచే విషయమై అధ్యయనం చేయాలని సూచించారు. కారుణ్య - మిగతా3లో

# చైనాకు ప్రత్యామ్నాయం తెలంగాణనే

ప్రపంచ పెట్టుబడిదారులకు ఉత్తమ గమ్యస్థానం హైదరాబాద్’

హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రాధాన్యం

- యూఎస్ఐఎస్‌పీఎఫ్ వార్షిక సమ్మిట్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- యూఎస్ఐఎస్‌పీఎఫ్ వార్షిక సమ్మిట్‌లో తెలంగాణరైజింగ్ 2047 విజన్ ప్రదర్శన
- ముఖ్యమంత్రి విజన్‌పై ప్రశంసలు కురిపించిన టెక్ దిగ్గజాలు
- ఢిల్లీ వేదికగా సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు
- భారత్‌లో పెట్టుబడులకు హైదరాబాద్ అత్యుత్తమ గమ్యస్థానం




ఢిల్లీ

అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణం, భద్రతకు ఎటువంటి ఢోకా లేకుండా భౌగోళికంగా కేంద్ర స్థానంలో ఉన్న హైదరాబాద్ ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు ఉత్తమ గమ్యస్థానమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. దేశంలోనే పెద్ద సంఖ్యలో యువత, వేగవంతమైన వృద్ధి రేటుతో ఉన్న రాష్ట్రం తెలంగాణ అని ముఖ్యమంత్రి అన్నారు. ఢిల్లిలో గురువారం జరిగిన అమెరికా సంయుక్త రాష్ట్రాలు–భారతదేశం వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సులో ముఖ్యమంత్రి ప్రసంగించారు. తెలంగాణలో గత 35 ఏళ్లుగా - మిగతా3లో



## ఎర్రకోట పేలుడు ఉగ్రచర్యే..

- అధికారికంగా ప్రకటించిన కేంద్రం
- దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన జైషే మహ్మద్ ఉగ్రసంస్థ ప్రమేయం
- అరెస్టయిన డాక్టర్ల ఫోన్లలో పాక్ హ్యాండ్లర్లతో టెలిగ్రామ్ చాట్స్
- ఫరీదాబాద్ మాడ్యూల్ పట్టుబడటంతోనే పేలుడు జరిగిందన్న అనుమానాలు
- అరెస్టయిన డాక్టర్లు టర్కీలో పర్యటించినట్లు నిర్ధారించిన అధికారులు



## కశ్మీరీ ముస్లింలు అందరూ ఉగ్రవాదులు కారు

- ప్రతి కశ్మీరీ ముస్లింను ఉగ్రవాదిగా చూడొద్దన్న ఒమర్ అబ్దుల్లా
- ఢిల్లీ పేలుళ్ల నేపథ్యంలో కశ్మీర్ ప్రజలపై వివక్ష వద్దని సూచన
- అమాయకులను చంపడాన్ని ఏ మతమూ సమర్థించదని వ్యాఖ్య

# భారీ మెజార్టీలో కాంగ్రెస్ గెలుస్తుంది



జూబ్లీహిల్స్ ఫలితం.. మంత్రి కోమటిరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

‘జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలుపు పక్కా ఖాయమైంది.

ఉప ఎన్నికలో 20వేల మెజార్టీతో కాంగ్రెస్ గెలుస్తుంది.

హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి ఫలితాలు రేపు(శుక్రవారం) వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికలో గెలుపుపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. భారీ మెజార్టీలో కాంగ్రెస్ గెలుస్తుందని జోస్యం చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తాజాగా మాట్లాడుతూ.. ‘జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలుపు పక్కా ఖాయమైంది. ఫలితాల కోసం రేపటి వరకు ఎదురుచూడాల్సిన అవసరం లేదు. ఉప ఎన్నికలో 20వేల మెజార్టీతో కాంగ్రెస్ గెలుస్తుంది. పోలైన ఓట్లలో 70 శాతం ఓట్లు కాంగ్రెస్‌కే పడ్డాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా 90 శాతం స్థానాల్లో విజయం - మిగతా3లో

## వచ్చే ఫిబ్రవరిలో బంగ్లాదేశ్‌లో ఎన్నికలు

- ఆ సమయంలోనే ప్రజాభిప్రాయ సేకరణ
- వచ్చే ఏడాది ఫిబ్రవరిలో బంగ్లాదేశ్‌లో సాధారణ ఎన్నికలు
- ఎన్నికలతో పాటే ‘జూలై చార్టర్’పై రిఫరెండం నిర్వహణ
- మధ్యంతర ప్రభుత్వ పాలకుడు మహమ్మద్ యూనస్ వెల్లడి
- ఖర్చు తగ్గించడంతో పాటు ఎన్నికలను పండుగలా జరుపుతామన్న యూనస్
- ఎన్నికలకు ముందే రిఫరెండం జరపాలని ఇస్లామిస్ట్ పార్టీల డిమాండ్
- డిమాండ్ నెరవేర్చకపోతే నిరసనలు తప్పవని హెచ్చరిక






## శబరిమల, ఎరుమేలిలో.. రసాయనాల కుంకుమపై నిషేధం

# జూబ్లీహిల్స్ చిక్కేదెవరికో?

- 42 టేబుళ్లు - 10 రౌండ్లలో లెక్కింపు
- నేడు మధ్యాహ్నానికి జూబ్లీహిల్స్ ఫలితం
- ఉత్కంఠ రేపుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలు
- ఎవరికి వారే తమదే గెలుపు అని భావిస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు



హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్వో కర్ణన్? తెలిపారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలోని డీఆర్సీ సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని ఆయన చెప్పారు. 407 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓట్లు లెక్కిస్తామన్నారు. మొత్తం 58 మంది అభ్యర్థులు ఉన్నందున ప్రత్యేక అనుమతి తీసుకుని లెక్కింపునకు 42 టేబుళ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. 10 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి చేస్తామని వివరించారు. కౌంటింగ్‌కు మొత్తం 186 మంది సిబ్బందిని కేటాయించామని, ఫలితాలను ఎప్పటికప్పుడు ఈసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని వెల్లడించారు. మీడియాకు ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి ఫలితాలను వెల్లడిస్తామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద 250 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని నగర జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ తెలిపారు. 15 ప్లాటూన్ల సిబ్బందిని రప్పిస్తున్నామని ఆర్వో కర్ణన్ తెలిపారు. - మిగతా3లో

# భారత్‌తో యుద్ధానికి పూర్తి సిద్ధంగా ఉన్నాం



- ఢిల్లీలో పేలుడు వేళ పాక్ మంత్రి సంచలన ప్రకటన
- తూర్పు సరిహద్దులోని భారత్ పశ్చిమ సరిహద్దులో తాలిబన్లతో రెండు వైపులా యుద్ధానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నాం
- మేము రెండు వైపులా యుద్ధానికి సిద్ధంగా ఉన్నాం
- ఈ యుద్ధంలో అల్లా మాకు అన్ని విధాలుగా సాయం చేస్తాడు

## సంపాదకీయం

# భారత్‌పై యుఎస్ టారీఫ్‌ల ఎఫెక్ట్

భారత ఎగుమతులపై అమెరికా సుంకాల ప్రభావం క్రమంగా పెరుగుతున్నది. దేశ జీడీపీ మీద, ఉత్పత్తి, ఉపాధి అవకాశాల ప్రభావం దేశంలోని కొన్ని కేంద్రాల్లో తీవ్రంగా ఉంది. అమెరికా సుంకాలు పది శాతంతో ప్రారంభమై ఆగస్టు 7 నాటికి 25 శాతం, ఆగస్టు 25 నాటికి 50శాతానికి చేరుకున్నాయి. వీటివల్ల గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ రిపోర్ట్ ప్రకారం 2025 మే నుండి సెప్టెంబర్ నాటికి అమెరికాకు మన దేశం చేసే ఎగుమతులు 37.5శాతానికి పడిపోయాయి. అమెరికాకు భారతదేశం ప్రతి సంవత్సరం సగటున 86.51 బిలియన్ డాలర్లు విలువ గల సరుకులను ఎగుమతులు చేస్తున్నది. ఇందులో 43శాతం అంటే 49.6 బిలియన్ డాలర్ల విలువ గల సరుకుల ఎగుమతులు పడిపోయాయి. వీటివల్ల అనేక రకాలుగా నష్టం జరిగింది. 2025 మేలో 8.8 బిలియన్ డాలర్ల విలువ గల సరుకులు ఎగుమతి చేస్తే, సెప్టెంబర్‌లో 5.5 బిలియన్ డాలర్లకు పడిపోయింది. దేశ జీడీపీలో 0.9శాతం తగ్గుదలకు అవకాశం ఏర్పడింది. జీడీపీ 6.5శాతం నుండి 5.6శాతానికి తగ్గే పరిస్థితి ఏర్పడింది. అమెరికాకు ఎగుమతులు తగ్గడంతో ఉత్పత్తి చేసే కంపెనీలలో సరుకులు గోడౌన్‌లలో మూలుగుతున్నాయి. సరుకు ఉత్పత్తిదారులు ఉత్పత్తిని తగ్గిస్తున్నారు. ఫలితంగా కార్మికులకు ఉపాధి తగ్గి ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. అంతిమంగా దేశంలో నిరుద్యోగం పెరగడానికి ఆర్థిక మందగమనం పెరగడానికి సంక్షోభానికి దారి తీసే పరిస్థితులు ఏర్పడ్డాయి. వీటి నివారణకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమెరికాను ఎదిరించే దమ్ము లేక దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నది. అమెరికా సుంకాల వల్ల కీలక రంగాలు తీవ్ర నష్టాలకు గురవుతున్నాయి. మే నుండి సెప్టెంబర్ వరకు ఫార్మాస్యుటికల్ ఎగుమతులు 15.7శాతం పడిపోయాయి. వాటి విలువ సుమారు 745.6 మిలియన్ డాలర్ల నుండి 628.3 మిలియన్ డాలర్లకు తగ్గింది. ఇండిస్టియల్ మెటల్స్ ఆటో పార్ట్స్ ఇతరాలు ప్రపంచవ్యాప్తంగానే 16.7శాతం ఎక్స్‌పోర్ట్ తగ్గాయి. మన దేశం నుండి ఎగుమతయ్యే అల్యూమినియం ఎక్స్‌పోర్ట్ 37శాతం, కాపర్ 25శాతం, ఆటో పార్ట్స్ 12శాతం, ఐరన్ మరియు స్టీల్ 8శాతం ఎగుమతులు తగ్గాయి. ఉత్పత్తి రంగంలోని కార్మికులు ఉపాధి పొందుతున్న రంగాలలో వస్త్రాలు, రసాయనాలు, వ్యవ సాయ, ఆహార పరిశ్రమలు, యంత్రాలు, రత్నాలు, ఆభరణాలు రంగాల యొక్క ఎగుమతులు 33శాతం పడిపోయాయి. ఇందులో మే నెలలో 4.8 బిలియన్ డాలర్ల నుండి సెప్టెంబర్ నాటికి 3.2 బిలియన్ డాలర్లకు తగ్గాయి. రత్నాల ఆభరణాల ఎగుమతులు 59.2 శాతం తగ్గి సుమారు 500.2 మిలియన్ డాలర్ల నుండి 202.8 మిలియన్ డాలర్ల విలువ గల సరుకులు తగ్గి పోయాయి. ఆ మేరకు వియత్నాం, థారులాండ్‌లు అమెరికా ఆర్డర్స్ పొంది లాభపడ్డాయి. సోలార్ ప్యానల్స్ ఎగుమతులు కూడా 60.8శాతం పడిపోయాయి. అంటే సుమారు 202.6 మిలియన్ డాలర్ల నుండి 79.4 మిలియన్ డాలర్ల విలువ నష్టపోవడం జరిగింది. ప్రధానంగా స్మార్ట్ ఫోన్ ఎగుమతులు కూడా భారీగా తగ్గాయి. గత సంవత్సరం ఇదే కాలంలో 197శాతం ఎగుమతులు పెరిగితే, ఈ మే నుండి 58 శాతం పడిపోయాయి. 2.2 బిలియన్ డాలర్ల నుండి 884.6 మిలియన్ డాలర్లకు పడిపోయాయి. వీటన్నింటిని బట్టి మనకు అర్థమయ్యేదేమంటే అమెరికా ట్రంప్ సుంకాల వల్ల మన దేశం ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడింది. ఆర్థికంగా నష్టం జరిగింది. మన దేశం అమెరికాకు సుమారు 86 బిలియన్ డాలర్ల విలువగల సరుకులు ఎగుమతి చేస్తున్నది. ఈ సంవత్సరం 50 బిలియన్ డాలర్లకు తగ్గే అవకాశం ఉందని అంచనా వేయబడింది. ఈ ఐదునెలల్లో 4.36 లక్షల కోట్ల విలువ గల సరుకులు ఎగుమతి ఆగిపోయి దేశంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. దేశంలో తయారీ, సేవల రంగాలు వాటి కార్యకలాపాలు తీవ్రంగా మందగిస్తున్నాయి. దాదాపు మూడు లక్షల ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయి. ఇదేవిధంగా సుంకాలు కొనసాగితే టెక్స్‌టైల్, గార్మెంట్స్ రంగాలలో దాదాపు లక్ష ఉద్యోగాలు ప్రమాదంలో పడతాయి. రత్నాలు ఆభరణాలు, సుమారు 80 నుంచి 90 వేల మంది ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. సూరత్ ముంబై వాణిజ్య కేంద్రాలలో డిమాండ్, ప్రొడక్షన్స్ తగ్గాయి. తోలు పరిశ్రమలో 20 నుండి 30 వేల ఉద్యోగాలు, ప్రాసెస్ చేసిన ఆహారం, రొయ్యలు వంటి రంగాల్లో 20 వేలు, రసాయనాలు, ఔషధాలు, ఆటో విడిభాగాల వంటి వాటిలో 40 నుంచి 50 వేల ఉద్యోగాలకు ప్రమాదం ఏర్పడింది. చిన్న, మధ్యతరహా పరిశ్రమలలో పదివేల ఉద్యోగాలు పోతాయి. ఈ సుంకాల ప్రభావం వల్ల గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లోని ప్రధానమైన నగరాలలో వీటి ప్రభావం ఉంటుంది. ఇంత నష్టం జరుగుతున్నా మోడీ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది. సుంకాల విధింపులకు కొద్ది నెలల ముందు ఫిబ్రవరిలో మోడీ అమెరికా పర్యటనలో 'మిషన్ 500' అని ఒప్పందం చేసుకొని 2030 నాటికీ 500 బిలియన్ డాలర్లు ఎగుమతి లక్ష్యంగా ప్రకటించింది. ఇదంతా జరగాలంటే రష్యాతో ఆయిల్ కొనరాదని, చైనాతో వ్యాపార సంబంధాలు ఉండరాదని, ముఖ్యంగా బ్రిక్స్ దేశాలలో సఖ్యత వాణిజ్యం తగ్గించుకోవాలని, డాలర్‌కు పోటీగా స్థానిక కరెన్సీలో వాణిజ్యం చేయరాదని అమెరికా కోరుకుంటున్నది. ముఖ్యంగా రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలో భారత్ పరోక్షంగా పాల్గొంటుందని, రష్యాతో ఆయిల్ కొనడం వల్లే రష్యా యుద్ధం చేస్తున్నదని ఆరోపించింది. మన దేశం వీటిని ఖండించినా ప్రతిఘటించడం లేదు. చైనాపై వేసిన సుంకాలకు అమెరికాకు ధీటుగా జవాబు చెప్పి ప్రత్యామ్నాయంగా వేరే దేశాల్లో తన సరుకులు ఎగుమతి చేసుకొని లాభపడుతున్నది. చివరికి వియత్నాం, థారులాండ్ లాంటివి కూడా లాభపడ్డాయి. భారత్ తీవ్రంగా నష్టపోయింది. మన వాణిజ్య సంబంధాలు అమెరికా కన్నా రష్యాతో ఉండడం వల్ల మనకు లాభం కలిగింది. ఈ కాలంలో రష్యాలో ఆయిల్ కొనడం వల్ల మన దేశం చాలా లాభపడింది. 2025 సంవత్సరంలో రోజుకు రెండు మిలియన్ బ్యారెల్స్ ఆయిల్ దిగుమతి చేసుకున్నాము. మొత్తం చమురులో 40 శాతం ఇది. ఒక బ్యారెల్ మీద 15 నుండి 20 డాలర్లు డిస్కౌంట్ లభిస్తున్నది. ఈ సంవత్సరం 3.8 బిలియన్ డాలర్లు అదా చేసుకున్నాం. మొత్తంగా 2022 నుండి ఇప్పటివరకు 10 బిలియన్ డాలర్లు ఆదా అయింది. అంటే మన రూపాయలలో రూ.88,732 కోట్లు. ఇది భారతదేశ స్కూల్ ఎడ్యుకేషన్ బడ్జెట్ కన్నా రూ.10 వేల కోట్లు ఎక్కువే. తెలంగాణ బడ్జెట్‌లో 40శాతం అని చెప్పవచ్చు. రష్యాలో చమురు కొనడం వల్ల మనకు కలిగిన లాభం ఇది. ఈ సొమ్ము కూడా దేశ ప్రజలకు ఉపయోగపడడం కన్నా దేశంలోని అంబానీ లాంటి బడా పెట్టుబడుదారులకు లాభం కలిగింది. రష్యాతో వ్యాపారం వల్ల మిగిలిన సొమ్ములో ఒక రిలయన్స్‌కే 40శాతం వెళ్లింది. అంటే సుమారు 30 వేల కోట్లు లాభపడ్డారు. కానీ ఆయిల్, పెట్రోల్, డీజిల్ రేటు తగ్గించలేదు. ఇప్పటికే రష్యాతో చమురు దిగుమతులు తగ్గించుకోవడానికి అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. అంబానీ కంపెనీలు చమురు దిగుమతులు తగ్గించుకోవడం లేదు. కానీ ప్రభుత్వరంగ సంస్థలు రష్యా నుండి చమురు దిగుమతి తగ్గించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి చేస్తున్నది. ఐఓసీఎల్, హెచ్‌పిసిఎల్ అలాంటి ప్రయత్నాలలో ఉన్నాయి. రాబోయే కాలంలో ప్రభుత్వరంగ సంస్థలు నష్టాలకు గురై దివాలా తీసే పరిస్థితి ఏర్పడితే వాటిని బడా పెట్టుబడిదారులైన అంబానీకి, ఆదానీకి కట్టబెట్టే కుట్రలో ఇది భాగం. మరో పక్క చైనాతో వాణిజ్య సంబంధాలు ఈ కాలంలో మెరుగుపడ్డాయి. మన దేశానికి చైనా నుండి దిగుమతులు క్రమంగా పెరిగాయి. 2024- 25 సంవత్సరంలో 113.45 బిలియన్ డాలర్లు విలువ గల సరుకులు దిగుమతి చేసుకున్నాము. మన దేశం నుండి చైనాకు ఎగుమతులు మాత్రం 14.25 బిలియన్ డాలర్లు మాత్రమే ఉన్నాయి. రెండు దేశాల మధ్యన వాణిజ్య వ్యత్యాసం 100 బిలియన్ డాలర్ల ఉంది. మన ఎగుమతులు పెరిగితే మన ఆర్థిక వ్యవస్థకు లాభం కలుగుతుంది. చైనా మన ఎగుమతులను కూడా ఆహ్వానిస్తున్నది. చైనా మన దేశం సరుకులపై విధించే టారిఫ్‌లు 22శాతం ఉంది. కాబట్టి మనం చైనాకు ఎగుమతుల వల్ల ప్రయోజనం ఉంటుంది. చైనా, రష్యా తదితర బ్రిక్స్ దేశాలతో మనం కలిసి ఉండీ వ్యాపారం చేసుకుంటే మన దేశానికి ప్రయోజనం ఉంటుంది.

# దేశ విదేశాల్లో రాణించిన టంగుటూరి


భానుమతి వలెనే టంగుటూరి సూర్యకుమారి కూడా బహుముఖ ప్రజ్ఞావంతురాలు. ఆమె నాట్య కారిణి, నటి, గాయని మాత్రమే కాదు మంచి వక్తగా కూడా గుర్తింపు తెచ్చుకుంది, తెలుగు పాటని, తెలుగు భాషని, భారతీయ నృత్యాలను స్వదేశంలోనే కాకుండా విదేశాల్లోనూ ప్రాచుర్యం పొంద డానికి ఆవిడ చేసిన కృషి అపూర్వం. అనన్య సామాన్యం. ప్రాచ్య, పాశ్చాత్య నృత్య, సంగీతాలకు మధ్య సుహృద్భావ సేతువుగా అంతర్జాతీయ కీర్తినందిన మధురగాయని ఆమె. టంగుటూరి సూర్యకుమారి (నవంబర్ 13, 1925 – ఏప్రిల్ 25, 2005) అలనాటి తెలుగు సినిమా నటి, ప్రసిద్ధ గాయకురాలు. ఆమె నవంబర్13,1925లో రాజమండ్రి లో జన్మించారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు తమ్ముడు టంగుటూరి శ్రీరాములు కూతురు. మూడో ఏట నుంచే పాటలుపాడేది. 1937లో మద్రాసు చేరుకుని, పన్నెండు, పదమూడేళ్ళ ప్రాయం లోనే సినీరంగ ప్రవేశము చేసి, 'రైతుబిడ్డ' సినిమాలో నటించింది. 1952లో ఆమె తొలి మద్రాసు అందాల సుందరి (మిస్ మద్రాసు)గా ఎంపికైంది. సూర్యకుమారి రూపం, కంఠస్వరం రెండూ బాగా ఉండడం చేత, అప్పటికే పెదనాన్న ప్రకాశం సభల్లో ప్రార్థన గీతాలు పాడుతూం డడం చేత సినిమావారి పిలుపు వచ్చింది. సాంప్రదాయ నియమ, నిష్టలుగల కుటుంబం కావడం చేత కొంత వ్యతిరేకత ఎదురయ్యింది. సూర్యకుమారి కంఠం, రంగూ, రూపం ఆకర్షణీయంగా ఉన్నా, మామూలు అమ్మాయిల కంటే కొంచెం పొడవుగా ఉండటం చేత, సినిమా రంగంలో సమస్య ఎదురైంది. ఆనాటి సగటు హీరోలు ఆమె కంటే పొట్టిగా ఉండటం కారణం. అదీ కాక ఆమె బ్రాహ్మణ, పేరుపొందిన రాజకీయ కుటుంబం నుంచి రావటమే కాదు, ప్రేమ సన్నివేశాలలో హీరోయిన్ మీద హీరో చెయ్యి వెయ్యడం, ఇత్యాదివి ఒప్పుకొనే వారు కాదు. గొప్ప చాతుర్యం ఉండి కూడా ఆమె సినిమాల్లో సుస్థిరత పొందలేక పోయింది. అయినా సూర్యకుమారి సినిమాల్లోకి వచ్చి తెలుగు, తమిళ, కన్నడ, హిందీ నాలుగు భాషల్లోనూ మొత్తం ఇరవై ఆరు సినిమాల్లో నటించింది. విప్రనారాయణ' ఆమె తొలిచిత్రం. అదృష్టం, జయప్రద దేవత, చంద్రహాసన, దీనబంధు. భక్త పోతన, భాగ్యలక్ష్మి, కృష్ణప్రేమ, గీతాంజలి, అదృష్ట దీపుడు, మరదలి పెళ్లి, భక్తరామదాసు తదితర తెలుగు చిత్రాల్లో ఉడన్', 'ఖటోలా' తదితర హిందీ చిత్రాల్లో, 'కటకం', 'నేంసారనౌక మొదలైన తమిళ చిత్రాల్లో నటించింది. అలాగే కన్నడ చిత్రం భారతి'లో, ఆంగ్ల చిత్రం 'బాంటే వయిటి లోనూ నటించింది. సూర్యకుమారి, లండన్లో నాట్య ప్రదర్శనలు నిర్వహిస్తూ, కాళికా దేవిగా నాటకాల్లో నటించేది. లలిత గీతాలు యాభై, దేశభక్తి గీతాలు యాభై మొత్తం నూరు గ్రామఫోను రికార్డులు ఇచ్చింది. అలాగే ఒక యాభై దాకా తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల సినిమాల్లో తన గొంతుతో పాడిన పాటల రికార్డులు ఉన్నాయి.నటన కంటే సూర్యకుమారి పాడిన దేశభక్తి గీతాలు, లలిత గీతాలు, అష్టపదులు వంటివాటికి ఎక్కువ ప్రజాదరణ లభించడంచేత ఆమె పాట కచ్చేరీలు తరుచూ చేస్తూండేది. ఆంధ్రలోని చాలా ఊళ్ళలో లలిత సంగీత కచ్చేరీలు చేసింది. పేరు ప్రతిష్టలు,



ప్రజాదరణ ఆమెకు తృప్తినివ్వ లేదు. ఏదో ప్రత్యేక కృషి చెయ్యాలన్న తపన, మూడు నాలుగేళ్ళపాటు కరతాళ ధ్వనులకు, ప్రశంసలకు దూరంగా ఉండి, చదువుమీద దృష్టి కేంద్రీక రించి, ప్రైవేటుగా కేంబ్రిడ్జి సీనియర్ పరీక్ష వ్రాసి, ప్రథమశ్రేణిలో పాసైంది.పలు భాషా చిత్రాలలో నటించిన సూర్యకుమారి మంచి గాయకు రాలు కూడా. స్వాతంత్ర్యోద్యమ సమయములో మా తెలుగు తల్లికి మల్లెపూదండ, దేశమును ప్రేమించుమన్నా మొదలైన అనేక దేశభక్తి గీతాలు పాడింది. ప్రకాశం పంతులు ఆమె కళాభిరుచిని బాగా ప్రోత్సహించి, శాస్త్రీయ సంగీతం నేర్పించాడు. ఆయన ఏ సభకు వెళ్ళినా ఆమెను తీసుకెళ్ళి జాతీయ గీతాలు పాడించేవాడు. 1953 అక్టోబరు 1న ఆంధ్ర రాష్టావతరణ సభలో నెహ్రూ, రాజాజీ, ప్రకాశం ప్రభృతుల సమక్షంలో, వందే మాతరం, మా తెలుగు తల్లికి మల్లె పూదండ పాటలు ఆలపించి అందర్నీ సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తింది. వీటితో పాటు 'స్వప్నజగతిలో ఛాయావీణ' మొదలైన లలిత గీతాలు, అడవి బాపిరాజు 'ప్రభువు గారికీ దణ్ణం పెట్టూ', 'రావోయి చిన్నవాడా' మొదలైన జానపద గీతాలు కూడా పాడుతుండేది. హెచ్.ఎం.వి. తదితర గ్రామఫోన్ కంపెనీలు ఈమె పాటలను రికార్డు చేశాయి. ఆమె పాడిన పాటలు గ్రాంఫోన్ రికార్డులుగా వెలువడి విరివిగా అమ్ముడు పోయేవి. ప్రత్యేకంగా రాయించుకున్న పాటలు ఆమెతో పాడించి మరీ గ్రామఫోన్ రికార్డులుగా తీసుకు రావడానికి అప్పటి గ్రాంఫోన్ కంపెనీ హెచ్.ఎం.వి. విశేష ఆసక్తి ప్రదర్శించేది, అలా ఆమె పాడిన పాటల్లో జాతీయ గీతాలు, భావగీతాలు, అష్టపదులు ఇలా చాలా రకాలు ఉన్నాయి. శంకరం బాడి సుందరాచారి రచించిన 'మా తెలుగుతల్లికి మల్లె పూదండ..' పాటని ఆమె పెదతండ్రి టంగుటూరి ప్రకాశం పంతులుతో వివిధ రాజకీయ సభల్లో పాడి ప్రాచుర్యం తెచ్చింది. ఆ సభల్లో వక్తగానూ ఆమెకు పేరుండేది. వెండి కంచాలలో వేడి బువ్వుందోయ్, పసిడి కంచాలలో పాల బువ్వం దోయ్, తిందాము రావోయ్ జాబిలి, ఆడుకుందాము రావోయ్ జాబిలీ' అంటూ నటిస్తూ పాడిన 'దేవత' చిత్రంలోని పాట, నారదుడుగా 'శ్రీకృష్ణ ప్రేమ'లో నటిస్తూ 'రేపే వస్తాడంట గోపాలుడు మాపే వస్తాడంట గోపాలుడు...' ఇలా చాలా పాటలు ప్రజాదరణ పొందాయి. 1958లో భారత చలనచిత్ర పరిశ్రమ ప్రతినిధుల బృందంలో ఒక ప్రతినిధిగా అమెరికాను సందర్శించి, తన ఉపన్యాసాలతో ఆకట్టుకుంది. అలా వారితో ఏర్పడిన సంబంధాలు 1959లో కొలంబియా యూని వర్సిటీ ట్యూటర్ గా వెళ్లి, పాశ్చాత్య సంగీతం, పాశ్చాత్య నృత్యాల్లో శిక్షణ పొంది వచ్చింది. సూర్యకుమారి ఆరోజుల్లోనే హాలీవుడ్ కి వెళ్లి ప్రముఖ దర్శకుడు ఆల్ ఫ్రెడ్ హిచ్ కాక్ వద్ద పని చేసింది. ఇంగ్లండ్లో సిరపడి ప్రముఖ పెయింటర్ హెరాల్డ్ ఎల్విన్ ను వివాహం చేసుకుని ఇండియా పెర్ఫార్మింగ్ ఆర్ట్స్' అనే సంగీత నాట్య పాఠశాలను నిర్వహించింది. ఇందులో భారతీయ పాశ్చాత్య కళలను, కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, పరస్పర సదవగాహన పెంపొందించం ముఖ్య ఆశయం. 1968లో ఆమె కృషిని బ్రిటిషు రాణి గుర్తించింది. 1969లో గాంధీజీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా మహాత్మా గాంధీకి నివాళులర్పిస్తూ సెయింట్ పాల్ కెథెడ్రల్ లో గానం చేసిన ప్రథమ భారతీయ వనిత ఆమె. నార్వే, స్వీడన్, హాలెండ్, స్పెయిన్, కెనడా, అమెరికా మొదలైన పలు దేశాలలో భారతీ య సంగీత శిక్షణాలయాలు నెలకొల్పి, వందలాది కళాకారు లను తయారు చేసింది. అమెరికాలో బ్రాడ్వే థియేటరులో విశ్వకవి రవీంద్రుని 'కింగ్ ఆఫ్ ది డార్క్ ఛాంబర్' నాటకంలో రాణి పాత్ర ధరించి, బ్రాడ్వే అవార్డు పొందిన మొదటి భారతీయ నటి. ఆ నాటకాన్ని న్యూయార్కులో ఎనిమిది నెలల పాటు ప్రదర్శించి, అటు తరువాత ఆఫ్రికాలో నాలుగు నెలలు పర్యటించింది. రవీంద్రనాథ్ ఠాగూర్ రాసి 'ది కింగ్ ఆఫ్ ది డార్క్ ఛాంబర్' నాటకంలో నటించింది. ఆ నాటకానికి దేశ విదేశాలలో విశేష ఆదరణ లభించడమే కాకుండా విదేశీయుల అభిమానాన్ని కూడా చూర గొ నే అవకాశం కలిగింది. కొలంబియా యూనివర్సిటీలో, లండను యూనివర్సిటీ విద్యా సంస్థలలో, బ్లాక్ థియేటరులోను భారతీయ నృత్యకళ సంగీతంపై వర్క్ షాపులు నిర్వహించింది. 1975లో హైదరాబాదులో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభ ఆమె సేవలను గుర్తించి సత్కరించింది. 1979లో రాజ్యలక్ష్మి అవార్డుతో ఆమెను గౌరవించింది. ఆమె ఏప్రిల్ 25, 2005 న లండనులో మరణించింది.

# మధుమేహం పట్ల అప్రమత్తత ఏదీ?

చక్కెర వ్యాధి... ఈ వ్యాధికి పేరులోనే చక్కెర... దాని ఫలితమంతా ఎంతో చేదు. ఆ వ్యాధి వస్తే చక్కెరకు ఇక దాదాపుగా దూరమైపోయినట్లే. షుగర్ వ్యాధిని ఆధునిక యుగపు మహమ్మారిగా భావించవచ్చు. అత్యంత వేగంగా పరుగెడుతున్న కాలంతో పాటే అనివార్యంగా జీవనశైలిలో చోటుచేసుకుంటున్న మార్పులే షుగర్ వ్యాధికి అసలు కారణం. మౌలికంగా ఇది జీవన శైలి సమస్య.వేదకాలంలో మధుమేహ ప్రస్తావన ఉంది. ఆ కాలంలో మధుమేహాన్ని 'అశ్రవ' అనే పేరుతో గుర్తించారు.ఈ వ్యాధి ఎలా వస్తుంది వ్యాధి లక్షణాలు ఏమిటి అని చరక సంహిత, శుశ్రవ సంహిత, నాగభట్ట గ్రంథాలలో వివరించారు. క్రీస్తు శకానికి వెయ్యి సంవత్సరాల కిందటనే ఈ వ్యాధి వర్ణన ఉండడం విశేషం. యజ్ఞ సమయాలలో దేవతలకు సమర్పించే హవిస్సును భుజించడం వలన ఈవ్యాధి వచ్చినట్లు పేర్కొన్నారు. దక్ష ప్రజాపతి చేసిన యజ్ఞంలో హవిస్సు భుజించడం వలన ఈ వ్యాధి వచ్చినట్లు ప్రస్తావన ఉంది. క్రీస్తు శకం ఆరవ శతాబ్దంలో అష్టాంగ హృదయ అనే గ్రంథంలో మధుమేహం అనే పదం వాడబడింది. తేనెను మధువు అని అంటారు కనుక ఈ వ్యాధిగ్రస్థుల మూత్రం తేనెరంగు ఉంటుందని దీనికి ఈ పేరు వచ్చిందని భావన. 1400 సంవత్సరాల క్రితమే ఈ వ్యాధిని పత్యం, ఔషధం, వ్యాయామంతో క్రమపరచవచ్చని పేర్కొన్నారు. దాదాపు ఇప్పటికీ అనుసరిస్తున్న విధానం అదే కావడం గమనార్హం. అంత ర్జాతీయ మధు మేహ సమాఖ్య, ప్రపంచ ఆరోగ్య సంస్థలు 1991 నుండి ప్రతి సంవత్సరం నవంబరు 14వ తేదిని మధుమేహ దినంగా పాటిస్తున్నాయి. 1922లో ఇన్సులిన్ హార్మోన్‌ను కనుగొన్న ఫ్రెడరిక్ బేంటింగ్ జన్మదినాన్ని పురస్కరించుకుని నవంబర్ 14న మధుమేహ దినంగా పాటిస్తున్నారు. 2006 డిసెంబర్ 20న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లి ఆమోదించిన తీర్మానం ప్రకారం మధుమేహ వ్యాధి ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న, ఆందోళనకర దీర్ఘకాలిక వ్యాధి కాబట్టి 2007నుండి మధుమేహ దినాన్ని ప్రజల్లో అవగాహం , చైతన్యం పెంచే కార్యక్రమాలతో సభ్యదేశాలన్ని అధికారికంగా జరపాలని ఐక్యరాజ్యసమితి పేర్కొన్నది. డయాబెటీస్ ఎలా వస్తుంది , దానివలం వచ్చే ముప్పు ఏమిటి , రాకుండా ఏమి చేయాలి , వచ్చాక ఎలాంటి జాగ్రత్తలు తీలుకోవాలి అనే అంశాలను ప్రచారము చేసే ప్రయత్నమే ఈ డయాబెటిక్ డే ముఖ్య ఉద్దేశము. ప్రపంచ మధుమేహ రాజధానిగా భారత్ మారిపోయింది. మధుమేహ సమస్య భారత్‌లో అత్యధికంగా ఉంది. ప్రస్తుతం ప్రపంచంలో 15 కోట్ల మంది, దేశంలో 4 కోట్ల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు అంచనా. 2025 నాటికి భారత దేశంలో ఈ వ్యాధిపీడితుల సంఖ్య 7 కోట్లకు చేరుకోగలదని భావిస్తున్నారు. భారత్‌లోని అన్ని రాష్ట్రాలతో



పోలిస్తే ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఈ వ్యాధి మరింత అధికంగా ఉంది. మధుమేహం కారణంగా ప్రతీ నిమిషానికి ఆరుగురు మరణిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతీ 20 మరణాల్లో ఒకటి మధుమేహం కారణంగానే చోటు చేసుకుంటున్నది. మధుమేహం, సంబంధిత వ్యాధుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా 32 లక్షల మంది మరణిస్తున్నారు. మధుమేహం ను నిశ్శబ్దహంతకిగా అభివర్ణిస్తారు. దీన్ని నివారించడం అంత తేలిక కానప్పటికీ, కొన్ని రకాల విధివిధానాలు పాటించడం ద్వారా దీన్ని సమర్థంగా ఎదుర్కోవచ్చు. మధుమేహం లేదా చక్కెర వ్యాధిని వైద్యభాషలో "డయాబెటిస్ మెల్లిటస్" అని వ్యవహరిస్తారు. డయాబెటిస్ అని కూడా వ్యవహరించే ఈ వ్యాధి, ఇన్సులిన్ హార్మోన్ స్థాయి తగ్గడం వల్ల కలిగే అనియంత్రిత మెటబాలిజం, రక్తంలో అధిక గ్లూకోజ్ స్థాయి వంటి లక్షణాలతో కూడిన ఒక రుగ్మత. అతిమూత్రం (పాలీయూరియా), దాహం ఎక్కువగా వేయడం (పాలీడిప్సియా), అతిగా ఆకలి వేయడము (పాలీ ఫేజియా), మంద గించిన చూపు, కారణం లేకుండా బరువు తగ్గడం, బద్ధకం దీని ముఖ్య లక్షణాలు. మధు మేహం లేదా చక్కెర వ్యాధిని సాధారణంగా రక్తంలో మితి మీరిన చక్కెర స్థాయిని బట్టి గుర్తిస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం భారత దేశం, చైనా, అమెరికాలలో అత్యధికంగా ఈ వ్యాధి ప్రబలి ఉన్నది. ఈ వ్యాధిని పూర్తిగా తగ్గించే మందులు లేవు. జీవితాంతం తగిన జాగ్రత్తలు తీసుకొన్నట్లయితే దీన్ని అదుపులో ఉంచుకోవడం సాధ్యం. 1921లో ఇన్సున్ అందుబాటులోకి రావడంతో అన్ని రకాలను నియంత్రించడం సాధ్యమయ్యింది. ఆహార అలవాట్ల మార్పు కూడా భాగమయినప్పటికీ, ఇన్సులిన్ ఉత్పత్తి లేని మొదటి రకాన్ని నియంత్రించడానికి ఇన్సులిన్ ఇంజెక్షన్ ఇవ్వటం తప్పనిసరి మార్గం. రెండవ రకం ఆహార అలవాట్ల మార్పు, ఆంటీ డయాబెటిక్ మందుల వాడకం వల్ల, అప్పుడప్పుడు ఇన్సులిన్ వాడకం వల్ల నియంత్రించవచ్చు. చక్కెర శాతం 400 మి.గ్రా. కన్నా ఎక్కువ కావడం...దీనినే డయాబెటిక్ కీటో అసిడోసిస్ అని కూడా అంటారు. ఈ స్థితిలో ఎక్కువగా దాహం, నాలుక తడారి పోవడం, మత్తుగా ఉండడం, వాంతులు, పొత్తి కడుపునొప్పి, తలనొ ప్పి, తలతిరగడం, విపరీతమైన నీరసం, ఒళ్ళు నొప్పులు లక్షణాలుగా ఉంటాయి. ఈ సమయంలో వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ఈ దశలో కూడా తాత్సారం చేస్తే మరణానికి దారి తీయవచ్చు. రక్తంలో చక్కెర శాతం 60 మి.గ్రా కన్నా తగ్గడం..షుగర్ లేదా హైపోగ్లైసి మియా అంటారు. మధుమేహ వ్యాధిని రక్త, మూత్ర పరీక్ష ద్వారా నిర్ధారించవచ్చు. సాధారణంగా రక్తంలో చక్కెర శాతం 80 నుంచి 140 మి.గ్రా వరకు ఉంటుంది. ఇంత కన్నా ఎక్కువ ఉంటే చక్కెర వ్యాధి ఉన్నట్లే. ఖాళీ కడుపుతో ఉన్న ప్పుడు చక్కెర శాతం 60 నుంచి 90 ఎంజీ / డీఎల్, తిన్న తరువాత 110 నుంచి 140 ఎంజీ / డీఎల్ ఉండాలి. ఇంతకన్నా ఎక్కువ ఉంటే చక్కెర వ్యాధి ఉన్నట్లే. చక్కెర వ్యాధికి ఆయుర్వేద మందులు కూడా ఉన్నాయి. భారతీయ ఆహారంలో తీపి, ఉప్పు, పులుపు, వగరు, చేదు, కారం లాంటి ఆరు రుచుల గురించి ప్రధానంగా పేర్కొన్నారు. ఆహారంలో తప్పని సరిగా ఆరు రుచులు ఉండాలన్నారు. చక్కెర వ్యాధిగ్రస్తులు కారం, వగరు, చేదు, రసాలు కలిగిన కూరగాయలు బాగా తీసుకోవలసి ఉంటుంది. శక్తిని ఇచ్చే అన్నం ఎక్కువగా తీసుకోకుండా, పొట్టు కలిగిన జొన్నరొట్టె, గోధుమ పుల్కాలు, సజ్జ రొట్టె తీసుకుంటే రక్తంలో చక్కెర శాతం పెరగకుండా ఉంటుంది. అలజడి, కోపం తగ్గించుకొని మానసిక ప్రశాంతత కలిగి ఉండాలి. యోగా, ధ్యానం, నడక లాంటివి చక్కెర వ్యాధి రాకుండా నిరోధిస్తాయి.

# వచ్చే ఫిబ్రవరిలో బంగ్లాదేశ్‌లో ఎన్నికలు



బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ అనిశ్చితికి తెరదించే ప్రయత్నంలో భాగంగా మధ్యంతర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. వచ్చే ఏడాది 2025 ఫిబ్రవరి ప్రథమార్థంలో సాధారణ ఎన్నికలతో పాటే రిఫరెండం కూడా నిర్వహిస్తామని ప్రధాన పాలకుడు మహమ్మద్ యూనస్ గురువారం ప్రకటించారు. ఇస్లామిస్ట్ పార్టీల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. దేశ ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... "సాధారణ ఎన్నికలతో పాటే రిఫరెండం నిర్వహించడం వల్ల సంస్కరణల లక్ష్యాలకు ఎలాంటి ఆటంకం ఉండదు. పైగా, ఇది ఎన్నికల ప్రక్రియను మరింత పండుగ వాతావరణంలో జరిపేందుకు, ఖర్చు తగ్గించేందుకు దోహదపడుతుంది" అని వివరించారు. రిఫరెండం నిర్వహణకు అవసరమైన చట్టాన్ని త్వరలోనే రూపొందిస్తామని, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన హామీ ఇచ్చారు. 'జూలై చార్టర్'లో ప్రతిపాదించిన రాజ్యాంగ సంస్కరణలపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. అయితే, ఈ ప్రకటన వెనుక ఇస్లామిస్ట్ పార్టీల నుంచి తీవ్ర ఒత్తిడి ఉన్నట్లు స్పష్టమవుతోంది. 'జూలై చార్టర్'కు చట్టబద్ధమైన గుర్తింపు ఇవ్వకుండా ఎన్నికలు జరపడానికి వీల్లేదని ఎనిమిది ఇస్లామిస్ట్ పార్టీలు మంగళ వారమే ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. ఎన్నికలకు ముందే రిఫరెండం నిర్వహించాలనే తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించాయి. జమాత్-ఎ-ఇస్లామీ, ఇస్లామీ ఆందోళన్ వంటి పార్టీలు ఇందులో ఉన్నాయి. ఢాకాలోని పల్టన్ కూడలిలో జరిగిన ఓ ర్యాలీలో ఈ పార్టీల నేతలు మాట్లాడుతూ.. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే మహమ్మద్ యూనస్ అధికారిక నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. "జూలై తిరుగుబాటుకు గుర్తింపు ఇవ్వకుండా ఎన్నికలు జరగవు. ఎన్నికలు జరగాలంటే ముందు చట్టబద్ధత కల్పించాలి. లేకపోతే ఆ ఎన్నికలు చట్టవిరుద్ధం అవుతాయి" అని జమాత్ నేత షఫీకుర్ రెహమాన్, ఇస్లామీ ఆందోళన్ నేత సయ్యద్ ముహమ్మద్ రెజాల్ కరీం స్పష్టం చేశారు. ఈ రాజకీయ ఉద్రిక్తతల నడుమ, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) మాత్రం 2026 ఫిబ్రవరిలో ఎన్నికలతో పాటు రిఫరెండం జరపాలని ప్రతిపాదిస్తోంది. మరోవైపు, ఇస్లామిస్ట్ పార్టీలు మాత్రం ఎన్నికలకు ముందే రిఫరెండం జరగాలని పట్టుబడుతున్నాయి. గతంలో షేక్ హసీనా నేతృత్వంలోని ప్రభుత్వాన్ని గద్దె దించడంలో యూనస్‌కు సహకరించిన పార్టీలే ఇప్పుడు సంస్కరణల విషయంలో ఆయనతో విభేదిస్తుండటంతో బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి కొనసాగుతోంది.

# ఎర్రకోట పేలుడు ఉగ్రచర్యే..



దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు ఘటనను కేంద్ర ప్రభుత్వం "ఉగ్రచర్య"గా అధికారికంగా ప్రకటించింది. ఈ నెల 10వ తేదీన జరిగిన ఈ దుర్ఘటనలో 10 మంది ప్రాణాలు కోల్పోగా, 20 మందికి పైగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది.బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భద్రతా కమిటీ సమావేశం అనంతరం ప్రభుత్వం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. "నవంబర్ 10వ తేదీ సాయంత్రం ఎర్రకోట వద్ద కారు పేలుడు రూపంలో దేశ వ్యతిరేక శక్తులు ఘోరమైన ఉగ్రదాడికి పాల్పడ్డాయి. ఉగ్రవాదంపై దాని అన్ని రూపాల్లోనూ జీరో టాలెరెన్స్ విధానానికే భారత్ కట్టుబడి ఉందని కేబినెట్ పునరుద్ఘాటిస్తోంది" అని ఆ ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ ఘటనపై ఇప్పటికే యూఏపీఏ, ఉగ్రవాద నిరోధక చట్టాల కింద ఎఫ్ఐఆర్ నమోదైంది.వెలుగులోకి జైషే కోణంఈ కేసు దర్యాప్తులో పోలీసులకు కీలక ఆధారాలు లభ్యమవుతున్నాయి. అరెస్టయిన డాక్టర్ల ఫోన్లలోని టెలిగ్రామ్ చాట్ల ద్వారా ఈ ఘటన వెనుక జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు. పాకిస్థాన్‌లోని జైషే హ్యాండ్లర్లతో వీరు టెలిగ్రామ్ ద్వారా సంప్రదింపులు జరిపినట్లు ప్రాథమిక విశ్లేషణలో తేలిందని ఓ సీనియర్ అధికారి తెలిపారు.భయంతోనే పేలుడు జరిగిందా?ఇది ప్రణాళిక ప్రకారం జరిగిన దాడా? లేక భయంతో చేసిన పేలుడా? అనే కోణంలోనూ దర్యాప్తు జరుగుతోంది. ఫరీదాబాద్‌లో ఓ ఉగ్రవాద మాడ్యూల్‌ను పోలీసులు పట్టుకున్న తర్వాత, భయంతోనే ఉగ్రవాదులు ఈ పేలుడుకు పాల్పడి ఉండవచ్చని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఫరీదాబాద్‌లో అరెస్టయిన వారికి, ఈ కేసులో అనుమానితుడైన డాక్టర్ ఉమర్‌కు సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసులో ఉన్నత విద్యావంతులైన డాక్టర్లు, తీవ్రవాద భావజాలంతో ప్రభావితమైన నెట్‌వర్క్‌ను జమ్మూకశ్మీర్ పోలీసులు ఛేదించారు.టర్కీ పర్యటన నిర్ధారణఈ క్రమంలోనే, అనుమానితులు డాక్టర్ ఉమర్ నబీ, డాక్టర్ ముజమ్మిల్ షకీల్ గనాయీ 2022లో టర్కీ వెళ్లినట్లు అధికారులు ధ్రువీకరించారు. అక్కడ తమ హ్యాండ్లర్లతో వీరు సమావేశమై ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.ఇదిలా ఉండగా, అరెస్టయిన డాక్టర్ షాహీన్ షాహిద్ మాజీ భర్త డాక్టర్ జాఫర్ హయత్ మీడియాతో మాట్లాడుతూ... ఆమె జీవితం ఇలా మలుపు తిరుగుతుందని తాను ఎప్పుడూ ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాన్పూర్‌లోని ఓ ఆస్పత్రిలో కంటి వైద్యుడిగా పనిచేస్తున్న ఆయన, తమకు 2003లో వివాహ మైందని, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. "ఆస్ట్రేలియా లేదా యూరప్ వెళ్దామని షాహీన్ పట్టుబట్టేది, కానీ నేను ఇక్కడే ఉండాలనుకున్నాను. ఓ రోజు ఉన్నట్టుండి ఆమె మమ్మల్ని వదిలి వెళ్లిపోయింది. 2015లో విడాకులు తీసుకు న్నాం, ఆ తర్వాత తిరిగి రాలేదు" అని ఆయన వివరించారు.

## శబరిమల, ఎరుమేలిలో.. రసాయనాల కుంకుమపై నిషేధం: హైకోర్టు

పథనంతిట్ట: హరిహరపుత్రుడు అయ్యప్ప స్వామి కొలువై ఉన్న శబరిమలలో.. ధర్మశాస్తాకు నిలయమైన ఎరుమేలిలో రసాయనాల కుంకుమ విక్రయాలకు కేరళ హైకోర్టు కళ్లెం వేసింది. భక్తుల ఆరోగ్యమే తమకు ముఖ్యమని, కెమికల్స్‌తో తయారైన కుంకుమను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు జస్టిస్ వి.రాజా విజయరాఘవన్, జస్టిస్ కేవీ జయకుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం తీర్పునిచ్చింది. కేరళ ప్రభుత్వం ఈ విషయంలో తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. ఇటీవల కేరళ ప్రభుత్వం పంపానదిలో సబ్బులు, షాంపూలను నిషేధించింది. అదేవిధంగా రసాయనాలతో తయారైన కుంకుమను ఎరుమేలి, శబరిమలలో విక్రయిం చడానికి వీలు లేదని తేల్చిచెప్పింది. సహజసిద్ధంగా తయారైన కుంకుమ విక్రయాలకు మాత్రమే అనుమతి ఉంటుందంటూ ఉత్తర్వులు జారీ చేసింది. శబరిమల, ఎరుమేలిలో వ్యాపారులకు కుంకుమను సరఫరా చేసే హోల్‌సేల్ వ్యాపారి ఒకరు ఈ ఉత్తర్వులను హైకోర్టులో సవాలు చేశారు. మండల, మకరవిళక్కు సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని, రూ.లక్షలు ఖర్చు చేసి.. కుంకుమ స్టాక్ తెచ్చుకున్నామని, ఇప్పటికిప్పుడు ప్రభుత్వం ఒక్క ఉత్తర్వుతో నిషేధం విధిస్తే తాము నష్టపోతామని వాదించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. తమకు భక్తుల ఆరోగ్యమే ముఖ్యమని, కెమికల్స్‌తో తయారైన కుంకుమను అనుమతించేది లేదని తేల్చిచెప్పింది. కేరళ సర్కారు ఉత్తర్వులను సమర్థించింది. ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు, ప్రభుత్వం తరఫు న్యాయవాదుల వాదనలతో ఏకీభవించింది.

## అల్ ఫలాహ్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడికి 9 సంస్థలు..

# రూ.7.5 కోట్ల మోసం కేసులో గతంలో జైలుకు



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీ ఎర్రకోట కారు పేలుడు కేసు దర్యాప్తు అల్ ఫలాహ్ యూనివర్సిటీ చుట్టూ తిరుగుతున్నది. ఈ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు 9 సంస్థలను నిర్వహించాడు. రూ.7.5 కోట్ల మోసం కేసులో అరెస్టైన ఆయన జైలు శిక్ష కూడా అనుభవించాడు. ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ ట్రస్టీ జావేద్ అహ్మద్ సిద్ధిఖీ ఈ యూనివర్సిటీకి నిధులు సమకూర్చాడు. ఈ నేపథ్యంలో ఈ నిధులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు చేస్తున్నది. కాగా, మధ్యప్రదేశ్‌కు చెందిన జావేద్ అహ్మద్ సిద్ధిఖీకి విస్తారమైన కార్పొరేట్ నెట్‌వర్క్ ఉన్నది. ఢిల్లీలోని జామియా నగర్‌లో అల్ ఫలాహ్ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం ఉన్న అల్ ఫలాహ్ హౌస్ చిరునామాతో విద్య, సాఫ్ట్‌వేర్, ఆర్థిక సేవలు, ఇంధన రంగాలకు చెందిన 9 కంపెనీలున్నాయి. మొదటి కంపెనీ అల్ ఫలాహ్ ఇన్వెస్ట్‌మెంట్ 1992లో ప్రారంభమైంది. అల్ ఫలాహ్ మెడికల్ రీసెర్చ్ ఫౌండేషన్, అల్ ఫలాహ్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్, అల్ ఫలాహ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ఫౌండేషన్, అల్ ఫలాహ్ ఎడ్యుకేషన్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎంజేహెచ్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్, అల్ ఫలాహ్ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్, అల్ ఫలాహ్ ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్, టార్బియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సంస్థలను సిద్ధిఖీ నిర్వహించాడు. మరోవైపు అల్ ఫలాహ్ గ్రూప్ ఆఫ్ కంపెనీల్లో డబ్బులు డిపాజిట్ చేయడానికి ప్రజలను ప్రోత్సహించే నకిలీ పెట్టుబడి పథకాలను ప్రవేశపెట్టినట్లు జావేద్ అహ్మద్ సిద్ధిఖీ, ఇతరులపై ఆరోపణలు వచ్చాయి. పెట్టుబడులను షేర్లుగా మార్చినట్లుగా నమ్మించేందుకు నకిలీ పత్రాలు సృష్టించారు. సేకరించిన నిధులను వ్యక్తిగత ఖాతాలకు మళ్లించారు. దీంతో రూ.7.5 కోట్ల మోసం కేసులో సిద్ధిఖీ, అనుచరుడు జావేద్ అహ్మద్‌పై ఢిల్లీలోని న్యూ ఫ్రెండ్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో 2001లో సిద్ధిఖీని పోలీసులు అరెస్ట్ చేశారు. 2003 మార్చిలో ఆయన బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించడంతో మూడేళ్లపాటు జైలులో ఉన్నాడు. అయితే మోసపోయిన పెట్టుబడిదారులకు డబ్బు తిరిగి చెల్లించడానికి సిద్ధిఖీ అంగీకరించడంతో 2004 ఫిబ్రవరిలో కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కాగా, జావేద్ అహ్మద్ సిద్ధిఖీకి చెందిన 9 సంస్థలు 2019 వరకు పనిచేశాయి. ఆయన అరెస్ట్ తర్వాత కొన్ని మూతపడగా మరికొన్ని సంస్థలు యాక్టివ్‌గా లేవు. అయితే అల్ ఫలాహ్ మెడికల్ రీసెర్చ్ ఫౌండేషన్ మాత్రమే ఉనికిలో ఉన్నది. 1997లో ఇంజినీరింగ్ కాలేజీగా ప్రారంభమైన ఈ విద్యా సంస్థ ప్రస్తుతం 78 ఎకరాల క్యాంపస్‌గా విస్తరించింది. ఢిల్లీ కారు పేలుడు కేసులో ఈ విద్యా సంస్థ కీలకంగా మారింది. ఫలాహ్ యూనివర్సిటీ ఉద్యోగులైన సయీద్, షకీల్, ఇతరులు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో నాక్ విచారణను కూడా ఈ విద్యా సంస్థ ఎదుర్కొంటోంది.

## బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు.. ఇద్దరు మృతి, ఐదుగురికి గాయాలు



**లక్నో:** బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించింది. ఇద్దరు వర్కర్లు మరణించగా ఐదుగురు గాయపడ్డారు. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గురువారం మధ్యాహ్నం బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు జరిగింది. పలు కిలోమీటర్ల దూరం వరకు పేలుడు శబ్దం వినిపించింది. దీంతో స్థానికులు భయాందోళన చెందారు. కాగా, ఫైర్‌క్రాకర్స్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికుల్లో ఇద్దరు మరణించారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. మంటలను అదుపు చేశారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు బాణసంచా తయారీ కర్మాగారానికి లైసెన్స్ ఉన్నదని పోలీస్ అధికారి తెలిపారు. అయితే భద్రతా ప్రమాణాల ఉల్లంఘన, కార్యకలాపాల్లో నిర్లక్ష్యం కారణంగా పేలుడు జరిగినట్లు చెప్పారు. యజమాని ఖలీద్‌తో పాటు అతడి సోదరుడు కూడా ఈ పేలుడులో గాయపడినట్లు వివరించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## కశ్మీరీ ముస్లింలు అందరూ ఉగ్రవాదులు కారు



ఢిల్లీలో ఇటీవల జరిగిన బాంబు పేలుడు నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌కు చెందిన వారిపై, ముఖ్యంగా కశ్మీరీ ముస్లింలపై వివక్ష చూపించే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి కశ్మీరీ ముస్లిం ఉగ్రవాది కాదని, ప్రజలందరినీ ఒకే కోణంలో చూడవద్దని ఆయన స్పష్టం చేశారు. కేవలం కొద్దిమంది చేసే తప్పులకు మొత్తం సమాజాన్ని నిందించడం సరికాదన్నారు. ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన పేలుడులో 13 మంది మరణించగా, అనేక మంది గాయపడిన సంగతి తెలిసిందే. ఈ దారుణ ఘటనను తీవ్రంగా ఖండించిన ఒమర్ అబ్దుల్లా, అమాయక ప్రజలను ఇంత క్రూరంగా చంపడాన్ని ఏ మతమూ సమర్థించదని అన్నారు. గురువారం జమ్మూలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "మనం ఒక విషయం గుర్తుంచుకోవాలి. జమ్మూకశ్మీర్‌లోని ప్రతి పౌరుడూ ఉగ్రవాది కాదు, ఉగ్రవాదులతో సంబంధం ఉన్నవాడూ కాదు. శాంతి, సోదరభావాన్ని దెబ్బతీసేది కేవలం కొద్దిమంది మాత్రమే. మనం కశ్మీరీలందరినీ, ప్రతి కశ్మీరీ ముస్లింను ఉగ్రవాదిగా చూస్తే, ప్రజలను సరైన మార్గంలో నడిపించడం కష్టమవుతుంది" అని ఒమర్ వివరించారు. ఈ పేలుడు వెనుక ఉన్న అసలైన దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, అయితే విచారణ పేరుతో అమాయకులను వేధించవద్దని ఆయన డిమాండ్ చేశారు. ఉగ్రవాద ఘటనల్లో డాక్టర్లు వంటి చదువుకున్న వారు పట్టుబడటంపై అడిగిన ప్రశ్నకు ఒమర్ బదులిస్తూ, "గతంలో మనం యూనివర్సిటీ ప్రొఫెసర్లను ఇలాంటి కేసుల్లో చూడలేదా? చదువుకున్న వారు ఇలాంటి పనుల్లో పాల్గొనరని ఎవరు చెప్పారు? వారు కూడా పాల్గొంటున్నారు" అని అన్నారు. అదే సమయంలో, ఈ ఘటనలో భద్రతా వైఫల్యం జరిగిందని ఒమర్ అబ్దుల్లా పరోక్షంగా ఆరోపించారు. "ఈ పేలుడుతో సంబంధం ఉన్న ఓ డాక్టర్‌ను గతంలో ఉద్యోగం నుంచి తొలగించినట్లు తెలిసింది. ఆ తర్వాత అతనిపై ఎలాంటి విచారణ జరిపారనే విషయం నన్ను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అతనిపై ప్రాసిక్యూషన్ ఎందుకు చేపట్టలేదు?" అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడటంలో కేంద్ర ప్రభుత్వానికి తాము పూర్తిగా సహకరిస్తున్నామని, ఇకముందు కూడా సహకరిస్తామని ఆయన తెలిపారు.

## భారత్‌తో యుద్ధానికి పూర్తి సిద్ధంగా ఉన్నాం



పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. తమ దేశం రెండు దేశాలతో యుద్ధానికి సిద్ధంగా ఉందంటూ ప్రకటించారు. తూర్పు సరిహద్దులోని భారత్ పశ్చిమ సరిహద్దులో తాలిబన్లతో రెండు వైపులా యుద్ధానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నామంటూ ప్రకటించారు. ఓ బహిరంగ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ విధంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. 'మేము రెండు వైపులా యుద్ధానికి సిద్ధంగా ఉన్నాము. తూర్పు (భారతదేశం), పశ్చిమ సరిహద్దు (అఫ్ఘానిస్థాన్) దేశాలను రెండింటినీ ఎదుర్కోవడానికి మేము పూర్తి సన్నద్ధతతో ఉన్నాం. ఈ యుద్ధంలో అల్లా మాకు అన్ని విధాలుగా సాయం చేస్తాడు' అంటూ వ్యాఖ్యానించారు. ఢిల్లీ పేలుడు ఘటన వేళ ఖవాజా వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. కాగా,పాక్‌లో రెండు రోజుల క్రితం ఆత్మాహుతి దాడి ఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఇస్లామాబాద్‌లోని ఓ కోర్టు ఆవరణలో కారులో బాంబు పేలింది. ఈ ఘటనలో 12 మంది మరణించగా.. 36 మంది గాయపడ్డారు. ఈ ఆత్మాహుతి బాంబు దాడికి తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (%వప్త్రీవవని-వ-ఖుశ్రీఅఘిఅ ౹ఖుఎఅర్ఘుఅ%) బాధ్యత వహించింది. అయితే, ఈ దాడి విషయంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్.. భారత్‌ను దోషిగా చూపే ప్రయత్నం చేశారు. ఈ దాడి వెనుక న్యూఢిల్లీ మద్దతు గ్రూపుల ప్రమేయం ఉందని ఆయన ఆరోపించారు.

# చైనాకు ప్రత్యామ్నాయం తెలంగాణనే

-మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్‌తో పాటు అనేక పార్టీలు ప్రభుత్వాలకు సారథ్యం వహించినా పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు అందరూ మద్దతుగా నిలిచారని ముఖ్యమంత్రి వివరించారు. భారత దేశంలో పెట్టుబడులకు హైదరాబాద్ ముఖ ద్వారమని సీఎం తెలిపారు. జీసీసీలకు గృమస్థానంగా ఉన్న హైదరాబాద్‌లో పెట్టుబడులకు ముందుకు రావాలని సీఎం పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించారు. మహిళా సాధికారిత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధితో పాటు మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన ప్రథమ ప్రాధాన్యత అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. గత 23 నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అద్భుతమైన మౌలిక వసతులతో 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీ భారత దేశంలోనే నూతన నగరంగా మారుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తయితే లండన్, టోక్యో, దుబాయి, సియోల్ రివర్‌ఫ్రంట్‌ల మాదిరే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని సీఎం అన్నారు. డ్రై పోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, మధ్య మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ వంటి కీలక ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల పురోగతిని వివరించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చైనా ౦1 మోడల్‌కు గ్లోబల్ సమాధానం తెలంగాణ అవుతుంది" అని అన్నారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే తక్కువ ఖర్చు, సులభమైన వీసా విధానాలతో దక్షిణాది దేశాల (గ్లోబల్ సౌత్) విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రపంచ స్థాయి విద్యా సంస్థలను ఆహ్వానించారు. భారతదేశంలో రోడ్లకు ఎక్కువగా నేతల పేర్లు ఉంటాయని... హైదరాబాదులో ఆ



ట్రెండ్ ను మార్చాలని తాము అనుకుంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ముఖ్యమైన రోడ్లకు గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీ పేర్లను పెడతామని సీఎం అన్నారు. సదస్సు ప్రారంభంలో తెలంగాణరైజింగ్ 2047 విజన్ ను ప్రదర్శించారు.

తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి లక్ష్యం ఢిల్లీలో జరిగిన యూఎస్ఐఎస్‌పీఎఫ్ వార్షిక సమావేశంలో విశేష ఆదరణ పొందింది. గ్లోబల్ ఇన్వెస్టర్లకు పెట్టుబడుల అవకాశాలు వివరించిన సీఎం ప్రసంగం, అంతర్జాతీయ వ్యాపార వర్గాలను ఆకట్టుకుంది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ విజన్ పారదర్శకంగా, సాహసోపేతంగా (బోల్డ్), సాధించగలిగేలా ఉంది. ఆయన చెప్పిన ప్రాజెక్టులు, వాటి సామాజిక ప్రభావం ఎంతో ప్రేరణాత్మకంగా ఉంది. రేవంత్ రెడ్డి విజన్ బోల్డ్, క్లియర్, అచీవబుల్: జాన్ ఛాంబర్స్, సిస్కో మాజీ సీఈఓ, టెక్ దిగ్గజం గ్లోబల్ సమ్మిట్‌కు హాజరవుతాం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు మా సభ్యులలో అత్యధికులం డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే యూఎస్ఐఎస్‌పీఎఫ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరవుతాం. తెలంగాణ విజన్‌ను దగ్గరగా తెలుసుకోవాలని మేమంతా ఆసక్తిగా ఉన్నాం.

# జూబ్లీహిల్స్ చిక్కేదెవరికో?

-మొదటిపేజీ తరువాయి

144 సెక్షన్ అమల్లో ఉంటుందని, అనుమతి ఉన్నవారు మాత్రమే లెక్కింపు కేంద్రం వద్దకు రావాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లితే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒక్కో రౌండుకు 45 నిమిషాలు : బుధవారం ఉదయం అన్ని పార్టీల అభ్యర్థులు స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించారు. ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనే అధికారులకు గురువారం తుది విడత శిక్షణ ఉంటుంది. శుక్రవారం వేకువజామున వారంతా స్ట్రాంగ్ రూమునకు చేరుకుంటారు. ఉదయం 5 గంటలకే అభ్యర్థుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి స్ట్రాంగ్ రూమ్ తలుపులు తెరిచి లోపలికి వెళ్తారు. ఈవీఎంలపై ఉండే సీళ్లు, ఇతరత్రా భద్రత ఏర్పాట్లను సరి చూసుకుని అంతా సవ్యంగా ఉందని నిర్ధారించుకున్న తర్వాత ఓట్ల లెక్కింపు కేంద్రానికి వెళ్తారు. ఒక్కో రౌండు ఓట్ల లెక్కింపునకు 45 నిమిషాల సమయం పట్టనుందని అంచనా. మొత్తం ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 3 గంటలకు పూర్తి అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**పోలింగ్ సరళి**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోలింగ్ శాతం అతి తక్కువగా నమోదు కావడంతో గెలుపు అవకాశాలు ఉత్కంఠను రేపుతున్నాయి. తక్కువ పోలింగ్ శాతం తమకే అనుకూలమని అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ విశ్లేషిస్తున్నాయి. సర్వేలన్నీ కాంగ్రెస్ వైపే మొగ్గు చూపుతున్నాయి. సిట్టింగ్ స్థానం తమకే దక్కుతుందని బీఆర్ఎస్ విశ్వాసం వ్యక్తం చేస్తోంది. ఎగ్జిట్? పోల్స్ ప్రకారం చూస్తే కాంగ్రెస్ 6 నుంచి 9 శాతం వరకు ఆధిక్యం వస్తుందని అంచనాలు వేస్తున్నారు.

**ఎక్కడెక్కడ ఎలా :**

ప్రస్తుతం నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,94,631 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు.

విజేతకు సుమారు 50 శాతం అంటే 97 వేల ఓట్లు రావాల్సి ఉంటుంది. ఇది బీజేపీకి పడే ఓట్లపై ఆధారపడి ఉంటాయి. బీజేపీ ఎక్కువ ఓట్లను చీల్చగలిగితే తక్కువ ఓట్లు వచ్చినా విజేతగా నిలుస్తారు.

అలాగే సోమాజిగూడలో 32 వేలు తక్కువగానే ఓట్లు ఉన్నాయి. ఇక్కడ పోలింగ్ శాతం కూడా తక్కువే.

షేక్?పేట, రహ్మత్‌నగర్ డివిజన్లలో ఎక్కువ ఓట్లు అనేవి ఉన్నాయి. 70 వేల చొప్పున 1.40 లక్షల ఓట్లు ఇక్కడే ఉన్నాయి. ఇక్కడ ఆధిక్యం అధికంగా వచ్చినవారికి విజయం దక్కుతుందని విశ్లేషకులు అభిప్రాయం.

ఎర్రగడ్డలో సుమారు 60 వేలు, యూసుఫ్?గూడలో 58 వేలు, వెంగళరావునగర్?లో 54 వేలు, బోరబండలో 50 వేల ఓట్లు అనేవి ఉన్నాయి. ఇక్కడ సగం కంటే తక్కువ పోలింగ్? శాతం నమోదు అయింది.

షేక్?పేట, రహ్మత్‌నగర్‌లలో మైనార్టీ ఓట్లు అధికంగా ఉన్నాయి. ఇక్కడ వారు ఎటువైపు మొగ్గు చూపితే అటువైపు అవకాశాలు అనేవి ఎక్కువగా ఉంటాయని అంచనా.


**కాంగ్రెస్ వ్యూహమే :**

పోల్ మేనేజ్‌మెంట్ సమర్థవంతంగా జరిగిందని కాంగ్రెస్? నేతలు తెలుపుతున్నారు. పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తారని ఆ పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్వతహాగా జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానం. ఈ ఉపఎన్నికలో సానుభూతి అంతా ఆ పార్టీకే తోడైంది. అయితే ఇక్కడ బీఆర్ఎస్ అనేది ప్రతిపక్షంలో ఉండటమే బలహీనం. కాంగ్రెస్ అధికారంలో ఉండటం అనేది ఆ పార్టీకి బలంగా మారనుంది. సీఎం రోడ్‌షోలు, ర్యాలీలు నిర్వహించడంతో పాటు ప్రత్యేకంగా రోజూ సమీక్షలు నిర్వహించారు. ప్రధానంగా డివిజనుకు ఇద్దరేసి చొప్పున మంత్రులను ఇన్ ఛార్జులుగా నియమించారు. ప్రతి 10 పోలింగ్? కేంద్రాలకు ఎమ్మెల్యేను నియమించారు. మొదట సర్వేల ప్రకారం బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉంటే కాంగ్రెస్ అధిక్యానికి పార్టీ వ్యహాలు పన్నినట్లు చెబుతున్నారు. పోలింగ్ శాతం పెరిగితే ప్రభుత్వ వ్యతిరేక ఓటుగా మారేదన్న విశ్లేషణ చేస్తున్నారు. తక్కువ కావడం కూడా తమకే అనుకూలమని కాంగ్రెస్? నేతలు అంటున్నారు.

# రాయదుర్గంలో గజం మూడున్నర లక్షలు

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ బూమ్ గత కొన్నేళ్లలో భారీగా పెరిగిపోయింది. నగరంలో ఎక్కడ చూసినా గజం లక్షల్లో పలుకుతోంది. ఇక సర్కార్ భూములను విక్రయించేందుకు ప్రభుత్వం నిర్వహించే వేలంలో రికార్డు ధరలు మోగుతున్నాయి. తాజాగా రాయదుర్గంలో చదరపు గజానికి ఏకంగా రూ.3.40 లక్షలు పలికి అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. అయితే 8 ఏళ్లలోనే ఆ భూమి ఏకంగా 4 రెట్లు పెరగడం గమనార్హం.తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఇక హైదరాబాద్ , నగర చుట్టు పక్కల జరుగుతున్న అభివృద్ధితో.. రియల్ ఎస్టేట్ రంగం అంచనాలకు మించి రికార్డులు సృష్టిస్తోంది. నగరంలో కీలక ప్రాంతాల్లో భూముల ధరలు చూస్తే.. కళ్లు తిరిగిపోవాల్సిందే. సామాన్యులే కాదు.. ధనవంతులు కూడా కొనలేని రీతిలో భూముల ధరలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఆధీనంలో ఉన్న భూములు కూడా.. హైదరాబాద్‌లో ఉండటంతో.. అది బంగారు బాతులా మారింది. దీంతో రాష్ట్ర ఖజానా నింపేందుకు.. ప్రభుత్వం అప్పుడప్పుడూ భూములను విక్రయిస్తూ ఉంటుంది. వేలం ద్వారా ప్రభుత్వ భూములను అమ్మకానికి పెడుతుంది.తాజాగా తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) నిర్వహించిన వేలంలో రికార్డు ధర పలికింది. హైదరాబాద్ నాలెడ్జ్ సిటీకి మధ్యలో ఉన్న రాయదుర్గం ప్రాంతంలో వేలం నిర్వహించగా.. కళ్లు బైర్లుకమ్మే ధర వచ్చింది. ఒక ఎకరం భూమిని వేలం వేయగా.. ఒక్కో చదరపు గజానికి రూ.3,40,000ల చొప్పున గణనీయమైన ధర పలికి.. అందర్నీ షాక్‌కు గురి చేసింది.ఒక చదరపు గజానికి రూ.3.40 లక్షల రికార్డు స్థాయి ధరతో తాజాగా నిర్వహించిన ఈ వేలం.. గత రికార్డును బద్దలు కొట్టింది. గతంలో 2017లో ఇదే ప్రాంతంలో చదరపు గజం రూ.88 వేలు పలికింది. కానీ గత 8 ఏళ్లలోనే ఆ భూమి ధర



ఆకాశాన్నంటడంతో అంతా అవాక్కయ్యారు. ఈ కొత్త ధర పాత రికార్డు కంటే 4 రెట్లు ఎక్కువ కావడం విశేషం. ఈ 4 రెట్ల ధర కేవలం 8 ఏళ్లలోనే రావడం గమనార్హం. రాయదుర్గం హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలో గజం రూ.3.40 లక్షలు పలికినట్లు టీజీఐఐసీ వైస్ ఛైర్మన్, ఎండీ కె.శశాంక వెల్లడించారు. మొత్తం 4700 గజాల స్థలాన్ని విక్రయించగా.. రూ.159.80 కోట్లు వచ్చినట్లు పేర్కొన్నారు.ఇక రాయదుర్గం భూమికి ఇంతటి భారీ ధర పలకడానికి పలు కారణాలు ఉన్నాయి. నాలెడ్జ్ సిటీలోని బొటిక్ మిక్స్‌డ్ యూజ్ ప్లాట్‌కు ఉన్న బలమైన డిమాండేనని తెలుస్తోంది. అక్కడ పరిమితంగా, అధిక నాణ్యత గల స్థలాలకు ఎంతటి అపారమైన విలువ లభిస్తుందో ఈ వేలం రుజువు చేసిందని రియల్ ఎస్టేట్ నిపుణులు పేర్కొంటున్నారు. అత్యంత ఖరీదైన ఈ వేలం.. హైదరాబాద్ నగరాన్ని అగ్రశ్రేణి పెట్టుబడి గమ్యస్థానంగా మరింత పటిష్టం చేస్తుందని చెబుతున్నారు. అదే సమయంలో ఇది రాష్ట్ర ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయాన్ని సమకూర్చినట్లు తెలిపారు.

## భారీ మెజార్టీలో కాంగ్రెస్ గెలుస్తుంది

-మొదటిపేజీ తరువాయి

సాధిస్తాం' అని ధీమా వ్యక్తం చేశారు. దీంతో, ఆయన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ఇదిలా ఉండగా.. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్(బీఆర్ఎస్) మృతితో ఉప ఎన్నిక నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. 58 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా.. ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ ఉంది. బీఆర్ఎస్ తరఫున మాగంటి గోపీనాథ్ భార్య సునీత, కాంగ్రెస్ పక్షాన నవీన్ యాదవ్, బీజేపీ తరఫున లంకల దీపక్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. గెలుపుపై ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. ఎన్నికను అధికార పార్టీ, ప్రతిపక్షాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఓటర్లు ఇచ్చే తీర్పుపై ఆసక్తి నెలకొంది. మరోవైపు.. ఎగ్జిట్ పోల్స్ ఫలితాల్లో ఓటర్లు కాంగ్రెస్‌కు పట్టం కట్టినట్లు తెలుస్తోంది.

## నష్టాల్లో ఉన్న ఆర్టీసీ డిపోలను లాభాల్లోకి తెచ్చే కార్యాచరణ రూపొందిస్తున్నాం

-మొదటిపేజీ తరువాయి

నియామకాల కింద ఎంపికైన కండక్టర్ల ప్రొవిజన్ పీరియడ్ రెండేళ్లకు తగ్గించాలని అన్నారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ డిపోలు లాభాల్లోకి వచ్చేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఆరాంఘర్ బస్సు టెర్మినల్ కోసం పోలీసు శాఖ భూములపై చర్చించాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో కొత్త డిపోలకు స్థల పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బస్సు ప్రమాదాలను తగ్గించడానికి డ్రైవర్ మానిటరింగ్ సిస్టం అమలు చేస్తామని అన్నారు. త్వరలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతో జూమ్ మీటింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

# కొత్త రైల్వే లైన్‌కు లైన్ క్లియర్



**మహబూబ్ నగర్ :** మహబూబ్‌నగర్– డోన్ రైల్వే లైన్ డబ్లింగ్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. త్వరలోనే భూసేకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే రైళ్ల రాకపోకలు మెరుగుపడటంతో పాటు సరకు రవాణా సామర్థ్యం పెరిగి, దక్షిణ తెలంగాణ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుంది.ప్రయాణికులకు శుభవార్త. మహబూబ్‌నగర్– డోన్ రైల్వే లైన్ డబ్లింగ్ ప్రాజెక్టు పనులు వేగవంతం కానున్నాయి. ఈ కీలక ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ ప్రారంభించడానికి కేంద్ర ప్రభుత్వం బుధవారం అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ఒక గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రైల్వే చట్టం, 1989లోని సెక్షన్ 20ఏ ప్రకారం.. ఈ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు కోసం భూములు ప్రజా ప్రయోజనాలకు అత్యవసరం అని కేంద్ర ప్రభుత్వం నిర్ధారించింది. ఈ నిర్ణయం ద్వారా మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో అవసరమైన భూములను సేకరించేందుకు రైల్వే శాఖకు అధికారికంగా మార్గం సుగమమైంది.నోటిఫికేషన్ జారీ అయిన తేదీ నుంచి 30 రోజుల వ్యవధిలోగా భూముల యజమానులు తమ అభ్యంతరాలను రాతపూర్వకంగా సమర్పించవచ్చు. ఈ అభ్యంతరాలను సంబంధిత రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, మహబూబ్‌నగర్ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. సమర్పించిన అభ్యంతరాలు, ఇతర వివరాలను అధికారులు పూర్తిగా సమీక్షించిన తర్వాతే భూసేకరణపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా, చట్టబద్ధంగా పూర్తి చేయాలని రైల్వే శాఖ ఆదేశించింది.మహబూబ్‌నగర్–డోన్ మార్గం దక్షిణ భారతదేశంలోని ముఖ్యమైన రైల్వే కారిడార్లలో ఒకటి. ఇది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలను కలుపుతుంది. సింగిల్ లైన్ కావడం వల్ల ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు జాప్యం జరిగేది, ముఖ్యంగా రద్దీ సమయాల్లో రైళ్లు గంటల తరబడి నిలిచిపోయే పరిస్థితి ఉండేది. దక్షిణ మధ్య రైల్వే తెలిపిన వివరాల ప్రకారం.. ఈ డబ్లింగ్ ప్రాజెక్టు ముఖ్యంగా రెండు ప్రధాన లక్ష్యాలను సాధించడానికి ఏర్పాటు చేస్తున్నారు. డబ్లింగ్ పూర్తయితే ఈ మార్గంలో అదనపు ప్యాసింజర్ రైళ్లను నడపవచ్చు. ప్రస్తుతం ఉన్న రైళ్ల ప్రయాణ సమయం తగ్గుతుంది. వేగంగా, సమయానికి రైళ్లు గమ్యస్థానాలకు చేరుకోగలుగుతాయి. ఈ మార్గం ద్వారా బొగ్గు, సిమెంట్, ఆహార ధాన్యాల వంటి సరకు రవాణా జరుగుతుంది. డబ్లింగ్‌తో సరకు రవాణా సామర్థ్యం గణనీయంగా పెరుగుతుంది, తద్వారా స్థానిక పరిశ్రమలకు, వాణిజ్య కార్యకలాపాలకు ఊతం లభిస్తుంది.ఈ ప్రాజెక్టు మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు దక్షిణ తెలంగాణ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుంది. మెరుగైన రైలు కనెక్టివిటీ వల్ల ఈ ప్రాంతంలో పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉంది. అంతేకాకుండా, ప్రాజెక్టు నిర్మాణ సమయంలో స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ డబ్లింగ్ పనులు పూర్తయితే.. దక్షిణ భారతం వైపు వెళ్లే రైల్వే నెట్‌వర్క్ మరింత పటిష్టమవుతుందని రైల్వే అధికారులు భావిస్తున్నారు.

# అప్పుడే చలి చంపేస్తోంది

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. రాబోయే వారం రోజులు ఇదే తరహా చలి వాతావరణం కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ ఫ్లూ లక్షణాలపై జాగ్రత్త వహించాలని వైద్యారోగ్యశాఖ సూచించింది.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత గణనీయంగా పెరగడంతో ప్రజలు గజ గజ వణికిపోతున్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో దీని ప్రభావం అధికంగా ఉంది. కొమురం భీం– ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ (యూ)లో మంగళవారం రాత్రి అత్యంత కనిష్ఠంగా 10.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. హైదరాబాద్ శేరిలింగంపల్లి హెచ్‌సీయూ ప్రాంతంలో 14.8 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఉదయం పొగమంచు, చలిగాలులు, రాత్రి వేళల్లో చలి తీవ్రత పెరుగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.రాష్ట్రంలో సగటున 4 నుంచి 5 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పడిపోయాయని తెలిపారు. ఈ నెలలో సగటు ఉష్ణోగ్రతలు 13 నుంచి 17 డిగ్రీల మధ్య కొనసాగే అవకాశం ఉందన్నారు. రాబోయే వారం రోజులు ఇదే తరహా చలి వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ముఖ్యంగా ఆదిలాబాద్, కొమురం భీం– ఆసిఫాబాద్, నల్గొండ, భద్రాచలం, రామగుండం, రంగారెడ్డి, యాదాద్రి–భువనగిరి, పటాన్‌చెరు, నిజామాబాద్, హైదరాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ శివారు హయత్‌నగర్ ప్రాంతాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. పగటి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 26 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉన్నా.. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రం అత్యల్పానికి పడిపోతాయన్నారు. చాలా ప్రాంతాల్లో 16 డిగ్రీలకు తగ్గే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ డైరెక్టర్ (డీహెచ్) రవీందర్ నాయక్ తెలిపారు. రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్లు, సీజనల్ ఫ్లూ పెరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జ్వరం, దగ్గు, గొంతు తడి ఆరిపోవడం, నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయవద్దని డాక్టర్లను వెంటనే కలవాలన్నారు. గర్భిణులు, ఐదేళ్లలోపు చిన్నారులు, వృద్ధుల్లో సీజనల్ ఫ్లూ లక్షణాలు లేదా అధిక జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉంటే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందాలన్నారు. మరో వారం రోజులు ఇదే తరహా వాతావరణం ఉంటుందన్న హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# గౌడ కులస్థుల సంక్షేమానికి కృషి

## నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం





**ధర్మఘంట, నవంబర్ 13 నకిరేకల్:**
గౌడ కులస్థుల సంక్షేమానికి కృషి చేస్తామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు, గురువారం నకిరేకల్ పట్టణంలో గౌడ కులస్థుల ఆధ్వర్యంలో రూ. 30.00 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ చెవుగోని రజిత – శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్లు, గౌడ సంఘం చైర్మన్ కొండ వెంకన్న, స్థానిక కౌన్సిలర్లు,గౌడ కులస్థులు తదితరులు పాల్గొన్నారు.

**నకిరేకల్ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి..**
నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 04,13,14 వార్డులో 1 కోటి 10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సి.సి రోడ్డు మరియు డ్రైనేజీ నిర్మాణ పనులకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపాలిటీ చైర్మన్ చెవుగోని రజిత – శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్లు, మున్సిపాలిటీ కమిషనర్, స్థానిక కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేడు నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 04,13,14 వార్డులో 1 కోటి 10 లక్షలతో సీసీ రోడ్లు మరియు డ్రెయినేజీల, నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామని, మరో 15 కోట్ల కోసం ప్రభుత్వంకు ప్రతిపాధనలు పంపామన్నారు. పట్టణంలో త్వరలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం ఈ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఏ ఎన్నికలు వచ్చినా ప్రజలు ప్రభుత్వానికి అండగా ఉండాలని, గత పాలకులను భరించలేక ఇంటికి పంపారని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. ప్రతి వార్డులో ఇండ్లు లేని పేద వారికి ముందుగా ఇండ్లను కేటాయిస్తామని, బిఆర్ఎస్, బీజేపీలు ఒప్పందం చేసుకొని జూబ్లీహిల్స్ లో ప్రచారం చేశారని, ఐనా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తామన్నారు.

# ఇది ఇక్కడితో ఆగాలి

## శాలిగౌరారం పిఏసిఎస్ డైరెక్టర్ పనికర కృష్ణ బహుజన

**ధర్మఘంట, నవంబర్ 13:**
మన దేశ రాజధాని ఢిల్లీ మహానగరం ఎర్రకోట సమీపంలో ఉగ్రవాదులు కారుబాంబు పేలుడులకు పాల్పడి, 12మంది ప్రాణాలు కోల్పోయి ఎంతోమంది గాయపడిన ఘటన చూస్తుంటే మన భారత ప్రభుత్వానికి ఉగ్రవాదులు మరోసారి సవాల్ విసిరారని రుజువైందని జై భీమ్ ఆర్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు శాలిగౌరారం పిఏసిఎస్ డైరెక్టర్ పనికర కృష్ణ బహుజన అన్నారు. మే 14 నాడు పల్గామా లో జరిగిన దాడికి 26 మంది బలైన విషయం మనందర%శీ% మర వాక ముందే మళ్లీ ఉగ్రవాదులు విధ్వంసం సృష్టిస్తుంటే అమాయక ప్రజల ప్రాణాలు కోల్పోతుంటే భారత ప్రభుత్వం గాని , దేశ భద్రతా సంస్థలు గాని, పోలీసులు నిఘా వ్యవస్థ గాని ఇంత పెద్ద ప్రజాస్వామ్య దేశంలో, ఎర్రకోటనే బద్దలు చేద్దామనే కుట్రతో మనదేశంలోకి ఉగ్రవాదులు చొచ్చుకొని వచ్చి కుంభస్థలాన్నే కొట్టే పెద్ద కుట్ర చేస్తే ఈ ప్రభుత్వం చేతులు కట్టుకొని కూర్చుందా ఏమిటి? అని ఆయన అన్నారు. ఇది ఆరంభం కాదు అని అంతం అంతకంటే కాదని పొరుగు దేశానికిదో నిత్య సంబరంగా మారిపోయిందని కానీ మన భారత ప్రభుత్వం పై యుద్ధంలో గెలవలేని ఉక్రోషంతో ఇదిగో ఇలాంటి వెన్నుపోటు పిరికిపంద చర్యలకు పాల్పడడం పరిపాటైపోయిందని.., ఢిల్లీ..బొంబాయి..హైదరాబాద్ మహానగరాలే లక్ష్యంగా ఉగ్రవాద చర్యలు తీవ్రవాద దాడులు జరుగుతున్నాయని ఆయన అన్నారు. మన భారత ప్రభుత్వం సరిహద్దులలో శత్రువలను తిప్పి కొట్టామని, నడిబొడ్డులో నిర్బంధిస్తున్నామనీ, అరెస్టులు చేస్తున్నా మనీ, జైళ్లలో తోసేస్తున్నా మనీ, ఎక్కడికక్కడ తొక్కేస్తున్నా మనీ, యుద్ధాల్లో మట్టికరిపిస్తున్నా మనీ,



గొప్పలు చెప్పటం తప్ప మన ప్రభుత్వనీకి ఏది చేతకాదని ఆయన అన్నారు. ఉగ్రవాదుల ఉక్రోషం ఎప్పటికప్పుడు పెరుగుతూనే రక్తదాహం కోసం దాడులు చేస్తూనే ఉన్నారు..ఒకటి కాదు...రెండు కాదు.. 1997 నుంచి ఇప్పటికి ముప్పై రెండుసార్లు ఒక్క మన ఢిల్లీ రాజధాని లోనే మరి భారత ప్రభుత్వం నిద్ర వ్యవస్థలో ఉందా ? ఇంకాఎంత మంది మరణించాలి , ఇంకెంత మంది గాయపడాలి ఇంకాఎన్ని కుటుంబాలు రోడ్డున పడాలి, ఇంకా ఎంత ఆస్తి నష్టం జరగాలి, అంచనాలకు అందనివి ఇవన్నీ అని ఆయన అన్నారు. దీనికి అంతం ఎప్పుడు.. మన దేశం ఎన్నో రకాల శాంతియయత్నాలు చేస్తుందని చెప్తుంది కానీ అంతర్జాతీయ వేదికలపై కూడా మన వాదనలను గట్టిగా వినిపించాలనీ మద్దతు కూడగట్టాలని ఆయన అన్నారు. గతంలో దౌత్య స్థాయిని దాటి ప్రధానమంత్రుల స్థాయి వరకు ఎన్నెన్నో సార్లు శాంతి చర్చలు జరిగాయని వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు కూడా
ఆయన స్వయంగా బస్సులో శాంతియాత్ర చేశారు. అయినా ఫలిత%శీ% ముష్కరలు లెక్కచేయకుండా అదే సమయంలో ఏకంగా భారత పార్లమెంట్ భవనంపైనే దాడికి తెగపడ్డారానీ దేశవిభజన తర్వాత జరిగిన అన్ని యుద్ధాల్లోనూ మనమే గెలిచిన ఈ మరణకాండ ఆగట్లేదని ఆయన అన్నారు. ఇన్ని జరిగినా భారత ప్రభుత్వ భద్రత వైఫల్యాన్ని పొరుగుదేశం ఎప్పటికప్పుడు ఇదిగో ఇప్పటిలా దొంగచాటున ఏదో ఒక కుట్ర చేస్తూనే ఉందని ఆయన అన్నారు.. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడల్లా భారత ప్రభుత్వం ఉపేక్షించడానికి వీల్లేదని, ఢిల్లీ దాడులకు పాల్పడిన వారిని విడిచిపెట్టేది లేదని, ప్రధానమంత్రి.. హెూం మంత్రి ప్రకటనలు గుప్పించడం గతంలో కూడా చూసామని ఆయన అన్నారు. ఇప్పటికైనా మన భారత ప్రభుత్వం అంతర్జాతీయ వేదికలపై పాకిస్తాన్ అసలు స్వరూపాన్ని మరోసారి బట్టబయలు చెయ్యాలినీ అంతేకాదు.. అటు అమెరికాతో మన సంబంధాలు కొద్దిగా సన్నగిల్లుతున్న తరుణంలో ఇలా ఢిల్లీపై దాడులు జరగడం వెనక..ఇంకేమైనా అంతర్జాతీయ శక్తుల ప్రమేయం ఉందేమోనన్న కోణంలో కూడా మనం ఆలోచన చెయ్యాలని. ఏదేమైనా ఇది ఇక్కడితో ఆగాలి మన ప్రభుత్వం అందుకోసం ఎంతవరకైనా వెళ్ళి శత్రువు మరోసారి పంజా విసరకుండా గట్టి భద్రత ఏర్పాట్లతో బుద్ధి చెప్పాల్సిందేనని ఆయన అన్నారు.







## వేదములలో మరుగై ఉన్న అవతార మూర్తి ఎవరు కరపత్రికను ఆవిష్కరించిన నాయకులు



**ధర్మఘంట, నవంబర్ 13 నాగర్ కర్నూలు:**




నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట పట్టణంలో నిర్వహించిన విడుదల ఉజ్జీవ సభలు గ్రాండ్ సెమీ క్రిస్మస్ కార్యక్రమంలో జాతీయ జేఏసీ చైర్మన్ బెజవాడ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాసభలో ధనుంజయ శాస్త్రి మరియు సింగర్ సాయిల్ మరియు ఉపవాస ప్రార్థనల సుదర్శన్ మిర్యాలగూడ మరియు స్పీకర్ పాల్ మథుస్ ఆదిరాజు మరియు దేవరకొండ అనసీయ రమేష్ మల్లెపల్లి రాజు అచ్చంపేట జాన్ పాల్ హెబ్రోన్ మరియు వందలాది మంది క్రైస్తవ సభలో నల్గొండ రమేష్ నేత జాతీయ కాంగ్రెస్ నాయకులు రాసిన కరపత్రమును వేదములలో మరుగైయున్న అవతార మూర్తి ఎవరు పత్రికలను విడుదల చేశారు నల్గొండ బృందం సభ్యులు కందుల విజయ్ కుమార్ మామిడాల జోసెఫ్ కోట్ల సునీతా దేవి మిర్యాలగూడ సుగుణయ కొన్ని సరస్వతి దుర్గయ్య బచ్చలకూర సునీత కొల్లి సరస్వతీ దుర్గయ్య సంగిరెడ్డి పద్మారాంరెడ్డి వసుకుల మాధవి వక్తలను మెమెంటో మరియు శాలువాలతో సత్కరించారు అలాగే సిద్దిపేట గద్దర్ కిష్టఫర్ జానపద కళాబృందాన్ని సత్కరించారు ఈ కార్యక్రమంలో మహిళలు యువతీ యువకులు పెద్దలు చిన్నలు క్రైస్తవ నాయకులు నాగర్ కర్నూలు జిల్లా బృందం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రైస్తవ భక్తులు పాల్గొనడం జరిగింది.

## ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డు జారీ కేంద్రం భవనాన్ని ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి





**ధర్మఘంట, నవంబర్ 13 నల్లగొండ:**
ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డు జారీ కేంద్రం భవనాన్ని రాష్ట్ర రోడ్డు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రూ. 15 లక్షల వ్యయంతో నిర్మించిన (సదరం శిబిరం) ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డు జారీ కేంద్రం ద్వారా దివ్యాంగులకు సులభంగా, వేగంగా గుర్తింపు కార్డులు జారీ చేసే సదుపాయం లభించనుందన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో ఇది మరో ముఖ్యమైన అడుగని తెలిపారు.

## బొర్ర సుధాకర్ కూతురి వివాహానికి హాజరైన మండలి చైర్మన్ గుత్తా





**ధర్మఘంట, నవంబర్ 13 నల్లగొండ:**
జిల్లాకేంద్రంలోని ఎన్ఆర్ఎస్ గార్డెన్స్ లో మాజీ ఎంపీపీ / జడ్పీటీసీ బొర్ర సుధాకర్ కూతురి వివాహానికి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# రైతులు దళారులకు నమ్మి మోసపోవద్దు

## ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



**జగిత్యాల :** రైతులు దాళారులకు నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సూచించారు.మేప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా జగిత్యాల పట్టణంలోని 15వ వార్డు శంకులపల్లి లో మేప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రారంభించి,వార్డులో 15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వారి కి రూపాయలు 2,300 మద్దతు ధర ప్రకటించిన,ఎఫ్సీఐ నిబంధనల వల్ల రాష్ట్రం ధాన్యం సేకరణతో రాష్ట్రానికి రూపాయలు 3 వేల కోట్ల నష్టం వస్తుందని,అట్టి నష్టాన్ని కేంద్రం భరించాలన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని,ధాన్యం ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు అమ్మడం ద్వారా సరైన మద్దతు ధర పొందవచ్చునని అన్నారు.రైతులు నూతన సాంకేతికత ఉపయోగించి దేశంలో రాష్ట్రములో డిమాండ్ ఉన్న ఉత్పత్తులను పండించాలని అప్పుడే లాభాలు వస్తాయని తెలిపారు.కండ్లపల్లి చెరువు పునరుద్ధరణ కు 27 లక్షల మంజూరు చేయటం జరిగింది..అధికారుల నిర్లక్ష్యంతో నాసిరకం పనులు జరిగాయిన్నారు.లింగం పెట్ గోవింద్ పల్లిలో మోప్మ వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని దృష్టికి వచ్చిందని కొనుగోలు కేంద్రం ఏర్పాటు కు కృషి చేస్తా అన్నారు. హామిలేఅవుట్ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలి...ప్లాట్ లు పెట్టేటప్పుడు యజమానులు ఆలోచన చేయాలని..పట్టణంలో ప్లాస్టిక్ నివారణ ప్రజల అందరి బాధ్యత అన్నారు.వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా మెప్మా కు ఆదాయం రావడం అభినందనీయం,మహిళ సంఘాలు స్టీల్ బ్యాంక్ ఏర్పాటు తో శుభ కార్యక్రమాలకు ఇవ్వడం వల్ల ఆదాయం పొందే అవకాశం ఉంది అని ఆదాయ మార్గాలు సృష్టించుకోవాలని అన్నారు.రాష్ట్రంలోనే అత్యధిక నిధులు జగిత్యాల కు మంజూరు అయ్యాయిని అభివృద్ధి కోసం అందరితో కలిసి పనిచేస్తానని జగిత్యాల అభివృద్ధి నా లక్ష్యం అన్నారు.మహిళా సంఘాల అభ్యున్నతి కి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని, పట్టణం నలువైపులా మార్కెట్ లు పార్కులు ఏర్పాటు చేయటం జరిగిందని, 15 వ వార్డులో 2 కోట్ల 21 లక్షలతో పనులు జరిగాయినిరోడ్డు వేసేటపుడు మొక్కలు నాటడం కోసం స్థలం కేటాయించాలని అధికారులకు సూచించారు. పట్టణం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తా అన్నారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ స్పందన డీఈ ఆనంద్, మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, అడువాల లక్ష్మణ్ ,మాజీ కౌన్సిలర్ తోట మల్లికార్జున్, మెప్మ ఏవో శ్రీనివాస్,ఏఈ అనిల్, శరణ్,టీపీబీవో శ్రీకర్,టీఎంసీ రజిత నాయకులు డిష్ జగన్, కుసరి అనిల్,పిట్ట ధర్మరాజు, శ్రీనివాస్ రెడ్డి రవీందర్ రావు పంబల రాము కూతురు రాజేష్, దుమాల రాజ్ కుమార్, శరత్ రావు, కూతురు శేఖర్, మహిళలు పాల్గొన్నారు.

# కోరుట్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల నిరసన, విధుల బహిష్కరణ



**కోరుట్ల :** నిర్మల్ కోర్టు ప్రాంగణంలో న్యాయవాది పుట్ట అనిల్ కుమార్ పై పోలీస్ దాడిని నిరసిస్తూ కోరుట్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు బైరి విజయ్ కుమార్ మాట్లాడుతూ న్యాయవ్యవస్థపైనే దాడులుగా భావిస్తున్నామన్నారు. న్యాయ పరిరక్షణ, న్యాయవాదుల భద్రతకై అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం అమలులోకి తేవాలని డిమాండ్ చేసారు. భవిష్యత్‌లో న్యాయవాదులపై దాడులు జరిగితే న్యాయవాదుల మంత ఏకమై పోరాడతారన్నారు. అవసరమైతే ప్రభుత్వం మెడలు వంచైనా అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు కొరకు ఉద్యమించడానికి సిద్ధంగా ఉన్నామని కోరుట్ల బార్ అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు.ఇదే కార్యక్రమంలో ఇటీవల ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన బాంబు దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి రెండు నిమిషాల మౌన నివాళులు అర్పించగా, గాయపడిన వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు బైరి విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి కొంపల్లి సురేష్, జాయింట్ సెక్రటరీ చిలివేరి రాజ శేఖర్, స్పోర్ట్స్ సెక్రటరీలు ఫసియుద్దీన్, సుతారి నవీన్ కుమార్,సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ కడకుంట్ల సదశివ రాజు, గోనే సదానంద్ నేత, చాప వందన, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ రాసభక్తుల రాజశేఖర్, ఊరడి నరేందర్, లైబ్రరీ సెక్రటరీ మర్రిపల్లి గంగాధర్, సీనియర్ న్యాయవాదులు చాప కిషోర్, కొలుగూరి శ్రీపతిరావు,అలాగే పలువురు జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజెన్లకు ప్రభుత్వం భరోసా

## -రాష్ట్ర సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**జగిత్యాల :** ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ వారికీ భరోసా కల్పిస్తున్నదని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ ఐ. వో. సి. హాలు లో జిల్లా సంక్షేమ శాఖ ముద్రించిన వయోవృద్ధుల వారోత్సవాల పోస్టర్లని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో మంత్రికి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వృద్ధ తల్లిదండ్రులను నిరాదరించే ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల్లోంచి 15 శాతం వరకు చెల్లించేలా ఉత్తర్వులు జా రీచేస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లా లోని వయోవృద్ధుల కోసం డే కేర్ సెంటర్ మంజూరు చేశామన్నారు. వయోవృద్ధులకు సేవలందిస్తున్న సీనియర్ సిటిజెన్స్ అస్సోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ను, వారి సంఘ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్లు బి. ఎస్. లత, బి. రాజా గౌడ్,జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ బి. నరేష్, సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, కార్యదర్శి గౌరీశెట్టి విశ్వ నాథం, ఉపాధ్యక్షులు పి. హన్మంత్ రెడ్డి, అశోక్ రావు, కోశాధికారి వి. ప్రకాష్ రావు, యాకోబు హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.


## సిపిఐ శతజయంతి ఉత్సవాల ప్రచార జాతర విజయవంతం చేయండి




**కోరుట్ల :** భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబర్ 26 న ఆవిర్భవించి సిపిఐ వచ్చేనెల డిసెంబర్ 26 నాటికి వందేళ్లు పూర్తి చేసుకున్న తరుణంలో దేశవ్యాప్తంగా ఉత్సవాలు నిర్వహించు కుంటుందని ఈ నేపథ్యంలో రాష్ట్రంలో శతజయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని నవంబర్ 15వ తేదీ నుండి 21వ తేదీ వరకు అదిలాబాద్ జిల్లా జోడిఘాట్ నుండి భద్రాచలం వరకు జరుగు రాష్ట్ర ప్రచార జాతరను విజయవంతం చేయాలని సిపిఐ శ్రేణులకు సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సుతారి రాములు పిలుపునిచ్చారు. గురువారం జగిత్యాల జిల్లా సిపిఐ జనరల్ బాడీ సమావేశం సీ ప్రభాకర్ భవన్లో జరిగింది. ఈ సందర్భంగా శతజయంతి ఉత్సవాల కరపత్రం విడుదల చేశారు.ఆనంతరం పలువురు నేతలు మాట్లాడుతూ భారతదేశాన్ని బ్రిటిష్ పాలకుల నుండి విముక్తి చేయడానికి దేశ స్వాతంత్ర ఉద్యమంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందని సమసమాజ నిర్మాణం కొరకు వర్గ దోపిడీకి వ్యతిరేకంగా పెట్టుబడి విధానాన్ని వ్యతిరేకిస్తూ కార్మిక కర్షక ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తున్న పార్టీ సిపిఐ అన్నారు. ప్రజా ఉద్యమాలను వారి హక్కుల సాధన కొరకు ఎంతోమంది కమ్యూనిస్టు యోధులు తమ ప్రాణాలు సైతం త్యాగం చేసిన చరిత్ర సిపిఐ ఉందన్న స్వాతంత్రం చిందించిన తర్వాత దేశ ప్రజల సంక్షేమం కోసం బ్యాంకులు జాతీయకరణ భూసంస్కరణలు భూమిబుక్తి వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన పార్టీ సిపిఐ అన్నారు. ఈ నెల 16న జగిత్యాల జిల్లాలో సీపీఐ ప్రచార జాతర ప్రచారం చేస్తూ వస్తుందని ఈ జాతర జగిత్యాల,కోరుట్ల, మెట్పల్లి కథలాపుర్, మండల కేంద్రాలలో ప్రచారంగావిస్తుందని తెలిపారు. ఈ జాతకు నాయకత్వం సిపిఐ జాతీయ నేత మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తకల పెల్లి శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి,ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నేతలు మునుగోరి హనుమంతు, తిప్పర్తి రమేష్, ఎండీ అలీ, వెన్న మహేష్, బెక్కం గంగాధర్, తదితరులు పాల్గొన్నారు







## బిజినెస్

# మళ్లీ భారీగా పెరిగిన బంగారం ధర

భారతీయులకు అత్యంత ఇష్టమైన వాటిల్లో బంగారం ముందు వరుసలో ఉంటుంది. ముఖ్యంగా మహిళలు బంగారు ఆభరణాలు ధరించేందుకు ఇష్టపడుతుంటారు. పండగలు, పెళ్లిళ్లు, శుభకార్యాల వంటి సమయాల్లో బంగారం తప్పని సరిగా ఉండాల్సిందే. ఒంటిపై బంగారం ఎంత ఎక్కువ ఉంటే అంత గౌరవంగా భావిస్తారు. అందుకే వీలైనంత మేరకు బంగారం కొంటునే ఉంటారు. ప్రపంచంలోనే అత్యధికంగా బంగారం దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉందంటేనే మన భారతీయులు ఏ స్థాయిలో బంగారం వినియోగిస్తారో అర్థమవుతుంది. అయితే, ఈ 2025లో బంగారం ధరలు ఊహించని స్థాయిలో కొండెక్కాయి. అయితే దీపావళి తర్వాత కాస్త దిగివచ్చి ఊరట కల్పించాయి. ఇక తగ్గుతాయిలే అనుకునే సరికి మళ్లీ పెరుగుతున్నాయి. ఇవాళ బంగారం రేట్లు భారీగా పెరిగాయి. ఇవాళ తులం బంగారం రేటు ఏకంగా రూ.1650 మేర పెరిగింది. మరి ప్రముఖ జువెలర్స్‌లో 22 క్యారెట్ల ఆభరణాల గోల్డ్ రేటు ఎంతుందో తెలుసుకుందాం. తనిష్క్ జువెలరీలో ఈరోజు 22 క్యారెట్ల ఆభరణాల బంగారం రేటు 1 గ్రాముకు రూ.110 మేర పెరిగి రూ. 11,335 వద్దకు చేరుకుంది. ఇక 10 గ్రాములు (తులానికి) రూ. 1100 మేర పెరిగి రూ. 1,13,350 వద్దకు చేరుకుంది. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో ఈ రోజు 22 క్యారెట్ల నగల తయారీ బంగారం రేటు గ్రాముకు రూ. 11,350 వద్ద ఉంది. ఇక తులానికి (10



గ్రాములకు) రూ. 1,13,500 వద్దకు చేరుకుంది. ప్రముఖ జువెలరీ సంస్థ జొయాలుక్కాస్‌లో ఈరోజు 22 క్యారెట్ల ఆభరణాల గోల్డ్ రేటు 1 గ్రాముకు రూ. 11,350 వద్ద ఉంది. అదే తులానికి అయితే రూ. 1,13,500 వద్ద ట్రేడవుతోంది. లలితా జువెలరీలో ఈరోజు 22 క్యారెట్ల బంగారం రేటు 1 గ్రాముకు రూ. 11,350 వద్ద ఉంది. అలాగే తులం (10 గ్రాములకు) ఈరోజు రూ. 1,13,500 పలుకుతోంది. కల్యాణ్ జువెలర్స్‌లో ఈరోజు 22 క్యారెట్ల ఆభరణాల గోల్డ్ ధర గ్రాముకు రూ. 11,350 గా ఉండగా 10 గ్రాములకు రూ .1,13,500 వద్దకు చేరుకుంది. దేశీయ మార్కెట్లో బంగారం ధరలు తగ్గినట్లే తగ్గి మళ్లీపెరుగుతున్నాయి.

## రూ.189 ఎంట్రీలెవల్ ప్రీపెయిడ్ ప్లాన్ నిలిపేసిన ఎయిర్‌టెల్




దేశీయ టెలికాం రంగంలో చౌకైన ప్లాన్‌లను తొలగించే పరంపర ఇంకా కొనసాగుతున్నట్టు కనిపిస్తోంది. తాజాగా ప్రైవేట్ రంగ టెలికాం భారతీ ఎయిర్‌టెల్ తన కస్టమర్లకు షాక్ ఇచ్చింది. ఈ ఏడాది జూలైలో తీసుకొచ్చిన రూ. 189 ఎంట్రీ-లెవెల్ ప్రీపెయిడ్ ప్లాన్‌ను తొలగించినట్టు సమాచారం. ప్రస్తుతం కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌లో ఈ ప్లాన్ కనిపించడంలేదు. ఈ ప్లాన్ ప్రధానంగా వాయిస్ కాల్స్ కోసం, తక్కువ డేటాతో అందుబాటులోకి తెచ్చింది. ఈ ప్లాన్‌ను నిలిపివేయడం వల్ల కాల్స్ కోసం మాత్రమే సెకండరీ సిమ్‌లో దీన్ని ఉపయోగిస్తున్న వారికి ఖర్చులు పెరగనున్నాయి. ఇప్పుడు రూ. 199తో కనీస రీఛార్జ్ ప్లాన్‌కు మారాల్సి ఉంటుంది. ఈ ప్లాన్ ఎంచుకున్న వారికి 100 ఎస్సెమ్మెస్‌లతో పాటు రోజుకు 2జీబీ డేటా, అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్ లభిస్తాయి. అయితే, ప్రజలు ఎక్కువ డేటాను ఉపయోగించుకునేలా మొబైల్ కంపెనీలు చౌకైన ప్లాన్‌లను తొలగిస్తున్నాయని చాలామంది నిపుణులు భావిస్తున్నారు. దీని వల్ల వినియోగదారులు తరచుగా ఆన్‌లైన్‌లో యాక్టివ్‌గా ఉండటానికి వీలవుతుంది. ప్రస్తుతం అందిస్తున్న ఉచిత, అపరిమిత 5జీ డేటాను పరిమితం చేయాలని టెలికాం కంపెనీలు భావిస్తున్నాయి. ఇదే జరిగితే, వినియోగదారులు మునుపటిలా ఇంటర్నెట్ వాడకాన్ని కొనసాగించడానికి ఖరీదైన డేటా ప్లాన్‌లను కొనుగోలు చేయాల్సి రావొచ్చు.

## ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లకు కీలక ప్రతిపాదనలు పంపిన కేంద్రం



దేశంలోని ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ప్యాకేజ్డ్ వస్తువులు, ఉత్పత్తులకు సంబంధించి 'కంట్రీ ఆఫ్ ఆరిజిన్(వస్తువు తయారైన దేశం)' ఆధారంగా సెర్చ్ చేసే ఫిల్టర్‌ను తప్పనిసరి చేయాలని ప్రతిపాదించింది. దీనివల్ల డిజిటల్ మార్కెట్‌ప్లేస్‌లలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది. వినియోగదారులు ఆన్‌లైన్‌లో షాపింగ్ చేస్తున్నప్పుడు ఉత్పత్తుల మూలాన్ని సులభంగా గుర్తించేలా చేయడం ద్వారా సరైన సమాచారం ఆధారంగా కొనుగోలు చేయడానికి వీలవుతుందని ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. ప్రభుత్వం ఓ ప్రకటనలో డ్రాఫ్ట్ లీగల్ మెట్రాలజీ (ప్యాకేజ్డ్ కమోడిటీస్) (రెండవ) సవరణ నియమాలు-2025 ద్వారా ప్రస్తుత ప్యాకేజింగ్ నియమాలను మార్చాలని యోచిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ ఫీచర్ ద్వారా ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో అవసరమైన సమాచారాన్ని గుర్తించడం మరింత సులభం అవుతుంది. దీనిపై ప్రజాభిప్రాయం కోసం మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌లో పబ్లిష్ చేసింది. ఈ నెల 22 వరకు అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తులను సులభంగా కనుగొనే వీలు కల్పించడం ద్వారా 'ఆత్మనిబర్భర్ భారత్', 'వోకల్ ఫర్ లోకల్' కార్యక్రమాల లక్ష్యానికి మద్దతు లభిస్తుందని ప్రభుత్వం పేర్కొంది.

## 12 దేశాల్లోని ప్రవాసులూ పేటీఎం యాప్ వినియోగించుకోవచ్చు




వినియోగదార్ల చెల్లింపుల అనుభూతిని మరింతగా పెంచేందుకు, సరికొత్తగా పేటీఎం యాప్‌ను తీర్చిదిద్దినట్లు మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ తెలిపింది. రోజు వారీ లావాదేవీల ప్రక్రియను సులభతరం చేసేందుకు, కృత్రిమ మేధ ప్రత్యేకతలను ఈ యాప్‌నకు జోడించింది. నవీకరించిన యాప్‌లో 15కి పైగా కొత్త సదుపాయాలను చేర్చింది. 12 దేశాల్లోని ప్రవాస భారతీయులు సహా దేశవ్యాప్తంగా వినియోగదార్లు తమ చెల్లింపులను వేగంగా చేసేందుకు ఇవి దోహదం చేస్తాయని వివరించింది. ప్రతి చెల్లింపుపై వినియోగదారులకు డిజిటల్ గోల్డ్ రూపేణా రివార్డులు ఇచ్చే సదుపాయాన్ని పేటీఎం తీసుకొచ్చింది. కృత్రిమ మేధను అనుసంధానం చేయడం వల్ల, వినియోగదార్ల చెల్లింపుల ధోరణులను అర్థం చేసుకోవడంతో పాటు, విడివిడిగా బ్యాంకు ఖాతాలను నమోదు చేసుకునే అవసరం లేకుండా.. యూపీఐ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లోని మొత్తం నిల్వ వివరాలను వేగంగా వినియోగదార్లు తెలుసుకోవచ్చని పేటీఎం వివరించింది. మ్యాజిక్ పేస్ట్ సదుపాయం ద్వారా వాట్సప్ మెసేజ్‌లు, ఫేవరేట్ కాంటాక్టుల జాబితా నుంచి బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్ఐ వివరాలను ఆటోమేటిక్‌గా నింపుకోవచ్చని.. తద్వారా వేగంగా చెల్లింపులు చేసే వీలుంటుందని తెలిపింది.

## రూ. 2.17 లక్షల కోట్లకు చేరిన క్రెడిట్ కార్డుల ఖర్చు



దేశవ్యాప్తంగా క్రెడిట్ కార్డు వాడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. తద్వారా ఖర్చు కూడా అంతే స్థాయిలో ఉందని కేర్ రేటింగ్స్ తెలిపింది. ఈ ఏడాది సెప్టెంబర్ నెలకు సంబంధించి క్రెడిట్ కార్డులపై డేటా విడుదల చేసిన కంపెనీ, సమీక్షించిన నెలలో క్రెడిట్ ఖర్చులు 23 శాతం వృద్ధితో రూ. 2.17 లక్షల కోట్లకు చేరాయని పేర్కొంది. అంతకుముందు ఆగష్టు నెలతో పోల్చినా కూడా ఇవి 13 శాతం పెరిగాయి. 2020 తర్వాత ఈ స్థాయిలో క్రెడిట్ కార్డు ఖర్చులు నమోదవడం ఇదే తొలిసారి. దీనికి ప్రధానంగా పండుగ సీజన్ గిరాకీకి ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ సంస్కరణలు దోహదపడ్డాయి. ఇదే సమయంలో బ్యాంకులు, ఆన్‌లైన్ స్టోర్లు భారీగా ఆఫర్లు కూడా ప్రకటించాయి. ఫలితంగా చాలామంది తమ క్రెడిట్ కార్డు కొనుగోళ్లను పెంచారు. మరోవైపు సెప్టెంబర్ నెలలో క్రెడిట్ కార్డుల సంఖ్య కూడా అధికంగానే పెరిగిందని కేర్ రేటింగ్స్ తెలిపింది. గతేడాది ఇదే నెలలో 10.6 కోట్ల కార్డులు ఉండగా, ఈ ఏడాదిలో అది 11.3 కోట్లకు చేరింది. ప్రస్తుతం క్రెడిట్ కార్డుల సగటు ఖర్చు సెప్టెంబర్ నెలలో దాదాపు రూ. 20,011కు చేరిందని నివేదిక పేర్కొంది.

## స్పోర్ట్స్

# రంజీల్లో జమ్ముకశ్మీర్ సంచలనం.. 65 ఏళ్లలో ఢిల్లీపై తొలి విజయం!

రంజీ ట్రోఫీలో మరో సంచలనం నమోదైంది. మేఘాలయ బ్యాటర్ ఆకాశ్ కుమార్ చౌదరి ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీతో రికార్డు నెలకొల్పగా.. దేశవాళీలో పెద్ద జట్టైన ఢిల్లీపై జమ్ము కశ్మీర్ జయభేరి మోగించింది. 65 ఏళ్లలో మాజీ ఛాంపియన్‌పై ఆ జట్టుకు ఇదే తొలి విజయం. కమ్రాన్ ఇక్బాల్(133 నాటౌట్), అకీబ్ నబీ(5-35), వన్షాజ్ శర్మ(6-68) బంతితో చెలరేగడంతో దశాబ్దాల కలను సాకారం చేసుకుంది. చిరస్మరణ విజయంతో జమ్ము టీమ్ ఎలైట్ గ్రూప్ డీలో రెండో స్థానానికి ఎగబాకింది. రంజీ ట్రోఫీలో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన జమ్ము కశ్మీర్ జట్టు ఢిల్లీకి ఊహించని షాకిచ్చింది. పటిష్టమైన ఢిల్లీ బ్యాటింగ్ లైనప్‌ను రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ జమ్ము బౌలర్లు తక్కువకే కట్టడి చేశారు. అకీబ్ నబీ(5-35), వన్షాజ్ శర్మ(6-68)లు విజృంభించి విజయానికి బాటలు వేశారు. అనంతరం 179 పరుగుల ఛేదనలో జమ్ము కశ్మీర్ ఓపెనర్ ఖమ్రాన్ ఇక్బాల్ (133 నాటౌట్) శతకంతో కదం తొక్కాడు. క్రీజులో పాతుకుపోయిన కమ్రాన్‌ను ఔట్ చేసేందుకు ఢిల్లీ బౌలర్లు తీవ్రంగా ప్రయత్నించినా లాభం లేకపోయింది.



### నబీ దెబ్బకొట్టినా..

తొలి ఇన్నింగ్స్‌లో ఢిల్లీని అకీబ్ నబీ కోలుకోలేని దెబ్బ తీశాడు. టాపార్డర్ విఫలమైనా కెప్టెన్ అయుష్ బదొని(64), ఆయుష్ డొసెజా(65), సుమిత్ మథూర్(55) అర్ధ శతకాలతో జట్టును ఆదుకున్నారు. ఆఖర్లో అకీబ్ ముష్తాక్(2-30) తిప్పేయగా ఢిల్లీ 211కే ఆలౌటయ్యింది. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన జమ్ము కశ్మీర్ సారథి పరాస్ డోగ్రా(106), అబ్దుల్ సమద్(85)ల మెరుపులతో మూడొందలు కొట్టింది. రెండో ఇన్నింగ్స్‌లోనైనా పెద్ద స్కోర్ చేయాలనుకున్న ఢిల్లీ బ్యాటర్లను వన్షాజ్ శర్మ(6-68) వికెట్ వేటతో హడలెత్తించాడు. ఆయుశ్ బదొని(72), ఆయుశ్ డొసెజ్(65)లు పోరాడినా.. మిడిలార్డర్, టెయిలెండర్లను వన్షాజ్ పెవిలియన్ పంపగా 277కే ఢిల్లీ ఇన్నింగ్స్ ముగిసింది. ప్రత్యర్థి నిర్దేశించిన ఛేదనలో జమ్ము ఓపెనర్ కమ్రాన్ ఇక్బాల్(133 నాటౌట్) సెంచరీతో చెలరేగాడు. ఢిల్లీ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న అతడు.. 20 ఫోర్లు, 3 సిక్సర్లతో జట్టుక చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడు.

## రాణించిన బంగ్లా బౌలర్లు





రెండు టెస్టులు, మూడు టీ20ల సిరీస్‌ల కోసం ఐర్లాండ్ క్రికెట్ జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటిస్తుంది. ఈ పర్యటనలో భాగంగా ఇవాళ (నవంబర్ 11) తొలి టెస్ట్ మొదలైంది. సిల్హెట్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఐర్లాండ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు 8 వికెట్ల నష్టానికి 270 పరుగులు చేసింది. వెటరన్ ఓపెనర్ పాల్ స్టిర్లింగ్ (60), కేడ్ కార్మిచేల్ (59) అర్ధ సెంచరీలతో రాణించగా.. కర్టిస్ క్యాంఫర్ (44), లోర్కన్ టకర్ (41), జోర్డన్ నీల్ (30) ఓ మోస్తరు స్కోర్లతో పర్వాలేదనిపించారు. బ్యారీ మెక్‌కార్తీ 21 పరుగులతో క్రీజ్‌లో ఉన్నాడు. తొలి రోజు ఆటలో చివరి బంతికి జోర్డన్ నీల్ ఔటయ్యాడు. ఐర్లాండ్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ ఆండ్రూ బల్బిర్నీ డకౌట్ కాగా.. హ్యారీ టెక్టర్ 1, ఆండీ మెక్‌బ్రైన్ 5 పరుగులు చేసి ఔటయ్యారు. బంగ్లా బౌలర్లలో మెహిది హసన్ మిరాజ్ 3 వికెట్లతో సత్తా చాటగా.. హసన్ మురద్ 2, హసన్ మహమూద్, నహిద్ రాణా, తైజుల్ ఇస్లాం తలో వికెట్ తీశారు. కాగా, ఈ పర్యటనలో రెండో టెస్ట్ నవంబర్ 19 నుంచి ఢాకాలో జరుగుతుంది. అనంతరం నవంబర్ 27, 29, డిసెంబర్ 2 తేదీల్లో మూడు టీ20లు జరుగుతాయి.

## దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్.. సవాల్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధమన్న సిరాజ్..!





ఈ నెల 14న నుంచి స్వదేశంలో దక్షిణాఫ్రికాతో రెండు టెస్టుల సిరీస్ ప్రారంభం కానున్నది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో తొలి మ్యాచ్ జరుగనున్నది. డిఫెండింగ్ వరల్డ్ టెస్ట్ చాంపియన్ దక్షిణాఫ్రికాపై మెరుగైన ప్రదర్శన చేయాలని టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ భావిస్తున్నాడు. సిరాజ్ భారత బౌలింగ్ లైనప్‌కు నాయకత్వం వహించనున్నాడు. టాప్ టెస్ట్ ర్యాంకర్ జస్‌ప్రీత్ బుమ్రాతో కలిసి బౌలింగ్ భారం మోయబోతున్నాడు. 2025-27 ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ సైకిల్ అత్యధిక వికెట్లు తీసిన ఈ హైదరాబాద్ బైలర్ స్వదేశంలో జరుగనున్న టెస్ట్ సిరీస్‌లో తనదైన ముద్రవేయాలని భావిస్తున్నాడు. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత జట్టు మూడోస్థానంలో ఉంది. ఈ సైకిల్ ప్రారంభంలో స్వదేశంలో జరిగిన టెస్టుల్లో భారత జట్టు వెస్టిండిస్‌ను ఓడించడంతో పాటు ఇంగ్లండ్‌తో జరిగిన ఐదుటెస్టుల 2-2తో సిరీస్‌ను సమం చేసింది. అదే సమయంలో దక్షిణాఫ్రికా పాకిస్తాన్‌తో జరిగిన 1-1తో డ్రాతో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ని సాధించింది. ఈ సిరీస్ %ఔజ% సైకిల్‌లో కీలకమైంది తెలిపాడు. దక్షిణాఫ్రికా డిఫెండింగ్ చాంపియన్స్ కాబట్టి.. పాకిస్తాన్‌తో జరిగిన సిరీస్‌ను 1-1తో డ్రా చేసుకున్నప్పటికీ.. ఆ జట్టుపై రాణిస్తామని సిరాజ్ విశ్వాసం వ్యక్తం చేశాడు. ప్రస్తుతం టీమిండియా మంచి ఫామ్‌లోనే ఉందని తెలిపాడు. ఇంగ్లండ్‌పై రాణించడంతోపాటు వెస్టిండీస్ సిరీస్‌ను గెలిచామని సిరాజ్ జియోస్టార్‌తో చెప్పుకొచ్చాడు. ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లోనూ సిరాజ్ అద్భుతంగా రాణించాడు. 23 వికెట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. వెస్టిండీస్‌పై సైతం అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించాడు. రెండు మ్యాచుల్లో పది వికెట్లు పడగొట్టాడు. దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని.. సవాల్ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు సిరాజ్ తెలిపాడు.




## రాజమౌళి బిగ్ ఈవెంట్.. హెూస్ట్‌గా ప్రముఖ యూట్యూబర్!

మహేష్ బాబు - రాజమౌళి కాంబోలో వస్తోన్న యాక్షన్ అడ్వెంచరస్ మూవీ ఎస్ఎస్ఎంబీ29. ఇటీవలే ఈ సినిమాకు సంబంధించి బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చాడు మన దర్శకధీరుడు. ఓ సాంగ్‌ను రిలీజ్ చేయడంతో ప్రియాంక చోప్రా ఫస్ట్ లుక్ రివీల్ చేశారు. అయితే ఈ మూవీ టైటిల్‌పై ఫ్యాన్స్‌లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. టైటిల్ ఎప్పుడెప్పుడు రివీల్ చేస్తారా? అని మహేశ్ బాబు ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాజమౌళి బిగ్ ఈవెంట్ ప్లాన్ చేశారు. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో బిగ్ ఈవెంట్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 15న గ్రాండ్ ఈవెంట్ జరగనుంది. ఈ వేడుకలో భాగంగా మూవీ టైటిల్‌తో పాటు మహేష్ బాబు ఫస్ట్ లుక్‌ను రివీల్ చేయనున్నారు. దీంతో భారీగా ఫ్యాన్స్ రానున్న నేపథ్యంలో దర్శకుడు రాజమౌళి కొన్ని సూచనలు ఇస్తూ ఒక వీడియో విడుదల చేశారు. ఈవెంట్ పాస్‌లు ఉన్నవాళ్లకు మాత్రమే అనుమతి ఉంటుందని ఆయన క్లారిటీ ఇచ్చారు. అయితే తాజాగా ఈ ప్రతిష్టాత్మక గ్రాండ్ ఈవెంట్‌కు హెూస్ట్ ఎవరన్నది కూడా టాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. ఇలాంటి పెద్ద పెద్ద ఈవెంట్లకు మన స్టార్ యాంకర్ సుమ ఉండనే ఉంటుంది. సుమతో పాటు ప్రముఖ యూట్యూబర్ ఈ మెగా ఈవెంట్‌కు హెూస్ట్‌గా పనిచేయనున్నారు. బాలీవుడ్‌కు చెందిన ఆశిష్ చంచలానీ హెూస్ట్‌గా కనిపించనున్నారు. ఈ విషయాన్ని ఓ ఫన్నీ వీడియో ద్వారా మేకర్స్ రివీల్ చేశారు. రాజమౌళితో కలిసి ఈ వీడియోను రూపొందించారు. కాగా.. తొలిసారి రాజమౌళి- మహేశ్ బాబు కాంబోలో వస్తోన్న ఈ భారీ ప్రాజెక్ట్‌కు గ్లోబ్ ట్రాటర్ ?అనే టైటిల్ ఖరారు చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ బిగ్ ఈవెంట్‌లో ఈ విషయాన్ని రివీల్ చేయనున్నారు. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌కు దాదాపు 50 వేల మందికి పైగా అభిమానులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని నవంబర్ 15న సాయంత్రం 7 గంటలకు జియోహాట్‌స్టార్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు.

## 'కొదమ సింహం' రీరిలీజ్.. అదిరిపోయేలా ట్రైలర్




మెగాస్టార్ చిరంజీవి నటించిన కొదమసింహం రీరిలీజ్ కానుంది. 1990లో విడుదలైన ఈ చిత్రంలో కౌబాయ్‌గా చిరు కనిపించారు. ఈనెల 21న సరికొత్త హంగులతో పాటు 4కే విజువల్స్‌తో రీరిలీజ్ కానుంది. ఈ క్రమంలో తాజాగా ట్రైలర్‌ను షేర్ చేశారు. దర్శకుడు కె.మురళీమోహనరావు తెరెక్కించిన ఈ చిత్రంలో సోనమ్, వాణీ విశ్వనాథ్,రాధ,సుజాత,అన్నపూర్ణ నటించగా మోహన్‌బాబు ముఖ్యపాత్ర పోషించారు. ఈ మూవీని కైకాల నాగేశ్వరరావు నిర్మించారు. ఇప్పుడు కూడా ఆయనే ఈ చిత్రాన్ని 5.1 డిజిటల్ సౌండింగ్‌తో చేయించి మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం విశేషం. ఇది 'హంటర్స్ ఆఫ్ ది ఇండియన్ ట్రెజరీ' అనే పేరుతో ఆంగ్లంలోకి అనువదించబడిన మొట్టమొదటి దక్షిణభారత చలనచిత్రంగా కొదమసింహం రికార్డ్ క్రియేట్ చేసింది. కౌబాయ్ పాత్రలని అంతకు ముందు ఎక్కువగా ఘట్టమనేని కృష్ణ పోషించేవారు. ఈ చిత్రంతో చిరంజీవి మొట్టమొదటి సారిగా పూర్తి నిడివి కౌబాయ్ పాత్రని పోషించారు. బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్స్ రాబట్టిన ఈ మూవీ 20 కేంద్రాల్లో శత దినోత్సవం జరుపుకుంది. ఇందులోని పాటలు 'జపం జపం జపం, కొంగ జపం', 'చక్కిలిగింతల రాగం', 'గుం గుమాయించు కొంచెం' బాగా పాపులర్ అయ్యాయి.

## ఫైట్ సీక్వెన్స్‌లో మన శంకర వర ప్రసాద్‌గారు.. చిరంజీవి టీం ఇప్పుడెక్కడుందో తెలుసా..?

టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం మన శంకర వర ప్రసాద్‌గారు 'పండగకు వస్తున్నారు' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తోన్న ఈ మూవీని అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్నాడు. లేడీ సూపర్ స్టార్ నయనతార ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఆసక్తిక వార్త ఒకటి బయటకు వచ్చింది. ప్రస్తుతం అనిల్ రావిపూడి టీం చిరంజీవిపై వచ్చే ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నట్టు సమాచారం. ఈ సీక్వెన్స్ ఫిలింనగర్ గోల్ఫ్ కోర్ట్ నేడు షురూ కాగా.. మరో రెండు రోజుల పాటు షూటింగ్ కొనసాగనుందట. ఈ షెడ్యూల్‌తో చిరంజీవికి సంబంధించిన టాకీ పార్ట్ పూర్తి కానుందని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విడుదల చేసిన మీసాల పిల్ల సాంగ్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఈ మూవీలో వీటీవీ గణేశ్, కేథరిన్ థ్రెసా, హర్షవర్ధన్, రేవంత్ భీమల (సంక్రాంతికి వస్తున్నాం) ఫేం బుల్లిరాజు) కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల-విష్ణు ప్రసాద్ హెూం బ్యానర్ గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీని 2026 సంక్రాంతి కానుకగా విడుదల చేయనుండగా.. రిలీజ్ డేట్‌పై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.





## మనం ముసలోళ్లమైనా బ్యాండ్ కొడుతనే ఉండు

### ఇంట్రెస్టింగ్‌గా రాజు-రాంబాయి ట్రైలర్

సిల్వర్ స్క్రీన్‌పై ఇప్పటివరకు మంచి సందేశాన్నిచ్చిచ్చే చాలా ప్రేమకథలు వచ్చాయని తెలిసిందే. అదే జోనర్‌లో వస్తున్న ప్రాజెక్ట్ రాజు - రాంబాయి. సాయిలు డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో అఖిల్ ఉడ్డెమారి, తేజస్వి (కమిటీ కుర్రోళ్లు ఫేం) హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈటీవీ ఒరిజినల్ మూవీగా వస్తోన్న ఈ చిత్రం నవంబర్ 21న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. హీరో క్యారెక్టర్ బ్యాండ్ బాజా మోగించే సీన్లతో మొదలైంది ట్రైలర్.. ఇక రాజు నువ్వెప్పుడు బ్యాండ్ కొడుతూనే ఉండు. మనకు పెళ్లైనా.. పిల్లలు పుట్టినా.. మనం ముసలోళ్లమైనా బ్యాండ్ కొడుతనే ఉండు సరే నా అంటూ హీరోయిన్ చెబుతున్న సాగుతున్న డైలాగ్స్ ఇంప్రెసివ్‌గా ఉన్నాయి. ఊళ్లో బ్యాండ్ కొట్టి జీవనం సాగించే రాజు అనే యువకుడికి చదువుకునే రాంబాయి అనే యువతికి మధ్య లవ్ ట్రాక్ నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు ట్రైలర్ హింట్ ఇచ్చేస్తుంది. ప్రేమ, పెళ్లి.. వాటి ద్వారా ఎదురయ్యే సమస్యలను చూపిస్తూ యూత్‌ను ఆలోచింపజేసేలా సినిమాను తెరకెక్కించినట్టు ట్రైలర్ ద్వారా తెలిసిపోతుంది. ఈ చిత్రానికి విరాటపర్వం డైరెక్టర్ వేణు ఊడుగుల వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.

## ఈ అందాల సోయగాన్ని దేశంలో సగం మంది చంపాలనుకున్నారా.. అదా శర్మ సంచలన కామెంట్స్



ప్రముఖ నటి అదా శర్మ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. 2008లో దర్శకుడు విక్రమ్ భట్ తెరకెక్కించిన హారర్ మూవీ '1920' తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన అదా, తన నటనతో మొదటి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత టాలీవుడ్‌లో పూరి జగన్నాథ్ %-% నితిన్ కాంబినేషన్‌లో వచ్చిన 'హార్ట్ ఎటాక్' మూవీతో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. ఆ చిత్రంలోని ఆమె ప్రదర్శనకు మంచి ప్రశంసలు లభించాయి. తర్వాత 'సన్నాఫ్ సత్యమూర్తి', 'క్షణం', 'కల్కి' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకుల మనసుల్లో చోటు సంపాదించింది. అయితే ఆశించిన స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో ఆమె బాలీవుడ్‌పై దృష్టి పెట్టింది. తన అందం, గ్లామర్‌తో పాటు రిస్క్ ఉన్న పాత్రలను ఎంచుకోవడంలో అదా ఎప్పుడూ ముందుంటుంది. అదే ధైర్యం ఆమె కెరీర్‌ను పూర్తిగా మార్చేసింది. 2023లో విడుదలైన 'ది కేరళ స్టోరీ' అదా శర్మ జీవితానికి నిజమైన టర్నింగ్ పాయింట్ అయింది. ఈ లేడీ ఓరియెంటెడ్ సినిమా దేశవ్యాప్తంగా భారీ చర్చకు దారితీసింది. రాజకీయ వివాదాల మధ్య విడుదలైన ఈ చిత్రం రూ. 400 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ మూవీతో అదా ఒక్కసారిగా నేషనల్ లెవెల్‌లో పాపులర్ అయింది.ఇటీవల ఒక ఇంటర్వ్యూలో అదా మాట్లాడుతూ.. "ది కేరళ స్టోరీ విడుదలైనప్పుడు సగం దేశం నన్ను చంపాలని అనుకుంది. కానీ మిగతా సగం దేశం నన్ను ప్రేమించి రక్షించింది. 1920 నుంచే నేను రిస్క్ ఉన్న రోల్స్ ఎంచుకుంటున్నాను. ఆ రిస్క్ వల్లే నేడు నాకు గుర్తింపు వచ్చింది. పాత్రలో భావోద్వేగం లేకపోతే నచ్చదు. యాక్షన్ సీన్లు ఉండాలి అని వెల్లడించింది. ఇక ప్రస్తుతం అదా శర్మ, దివంగత నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ నివసించిన అదే ఫ్లాట్‌లో ఉంటోంది. ఆ ఇంట్లో సుశాంత్ ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ ఫ్లాట్‌ను చాలా మంది అద్దెకు తీసుకోవడానికి భయపడ్డా, అదా మాత్రం ధైర్యంగా అక్కడే ఉంటోంది.ఇటీవల ఆమె 'బస్తర్: ది నక్సల్ స్టోరీ' సినిమాలో శక్తివంతమైన పాత్రలో కనిపించింది. అదనంగా మరో యాక్షన్ థ్రిల్లర్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. సోషల్ మీడియాలో కూడా అదా యాక్టివ్‌గా ఉంటూ, తన ఇన్‌స్టాగ్రామ్ పోస్టులు, ఫిట్‌నెస్ వీడియోలు, డాన్స్ క్లిప్స్, గ్లామరస్ ఫోటోషూట్లతో తరచూ ట్రెండింగ్‌లో నిలుస్తోంది. సవాలు ఉన్న పాత్రలతోనే అదా శర్మ తనదైన ముద్ర వేసుకుంటూ బాలీవుడ్‌లో సత్తా చాటుతోంది.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108